జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 03 పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2017




## పార్టీల రణమా? ఎన్నికల సంస్కరణమా?



## అప్పు వైద్యం అందని దేశంలో...

## వీవీఎఫ్ ఫెలోషిప్



## రాజకీయ సంస్కరణలపై జేపీ తో కలసి పనిచేయండి







# సుపరిపాలన కోసం 3,500 కిలోమీటర్లు !

విజన్ ఇండియా ఫౌండేషన్ సంస్థ విశాఖపట్నంలో నిర్వహించిన గుడ్ గవర్నెన్స్ యాత్ర స్నాతకోత్సవ సమావేశంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఉత్తమ నమూనా పథకాలను తెలియచేసేలా.. ఎంపికచేసిన 40 మంది యువతను ఏటా దేశవ్యాప్తంగా పర్యటనకు తీసుకెళ్లే ప్రయోగాత్మక కార్యక్రమమే గుడ్ గవర్నెన్స్ యాత్ర. తాజాబృందం ఆరు రాష్ట్రాల్లో 3,500 కిలోమీటర్ల మేర యాత్ర చేసి విశాఖకు చేరుకుంది. తమ కెరీర్‌ను చూసుకుంటూనే దేశంలో మార్పు కోసం స్థానికంగా థాట్ లీడర్స్‌గా పనిచేస్తామని ముందుకొచ్చిన ఈ యువతీయువకులను జేపీ అభినందించారు. సుపరిపాలనకు అవసరమైన చురుకైన పౌరసత్వం, నాయకత్వం దిశగా వారికి సూచనలిచ్చారు.






సురాజ్య ఉద్యమం సహా లోక్‌సత్తా నిర్వహించిన పలు కార్యక్రమాలలో తన వంతు సహకారాన్ని అందించిన వంగపండు ప్రసాదరావు పాటకి స్వర్ణోత్సవం (ఏం పిల్లడో ఎల్దు మొస్తవా) సందర్భంగా విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని డా॥ బీఆర్ అంబేద్కర్ హాల్‌లో రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలియచేసిన లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ.

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 03

## లోపలి పేజీల్లో...

రైతుల ఆత్మహత్యల్లో ముందున్న........... 5
ఇప్పటికీ అధిక వడ్డీ వ్యాపారులే దిక్కు..... 7
పంట బీమాకు రుణాల దెబ్బ................ 8
'ప్లెడ్జి రుణాలు' 4 లక్షల రైతుల్లో ............ 9
అంకెల రంకెలకు, వాస్తవాలకు లంకె..... 11
రైతుకు కొలబత్తెం............................ 17
ఆత్మహత్యలు-ఆత్మహత్యాప్రయత్నాలు... 19
నాయకి....................................... 21
రోజూ రూ.10,000 కోట్ల నల్లధనం..... 23
పార్టీల రణమా? ఎన్నికల సంస్కరణమా? 25
ఓటర్లకు స్వేచ్ఛలేని ఎన్నికలతో ............. 28
చదివేది ఏడు-పేరు రాసుకోవడం......... 31
ఎస్‌కే డే మళ్లీ ఇన్నాళ్లకు గుర్తుకొచ్చారు.... 32
జాతీయ మద్యం విధానం కోసం కృషి..... 33
సైన్స్ వ్యతిరేక ఉద్యమం పెరుగుతోంది 34

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# అప్పు, వైద్యం అందని దేశంలో..



అప్పిచ్చువాడు, వైద్యుడు లేని చోట నివాసముండకూడదన్నది నానుడి! వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతీసంప్రదాయాల గురించి గర్వంగా చెప్పుకునే మనం.. ఇప్పటికీ ఆ మాటల్ని అర్థం చేసుకుని మనదేశాన్ని నివాసయోగ్యంగా మార్చుకోలేకపోయాం. దేశ జనాభాలో అత్యధికులు ఆధారపడిన వ్యవసాయరంగంలో కేవలం అవసరాలకు తగ్గ అప్పులు అందక, అధిక వడ్డీలకు తెచ్చిన అప్పుల్ని తీర్చలేక పలువురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు లేదా కాల్‌మనీ వంటి వాటి బారినపడి జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. రైతుకు ఆదాయం చుట్టూ నూతన వ్యవసాయ విధానాన్ని రూపొందించాలని మొత్తుకున్నా వినకుండా తాజాగా రుణమాఫీ చేసిన తెలుగు రాష్ట్రాలు రైతుల అప్పుల భారంలో, ఆత్మహత్యల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. తలసరి ఆదాయంలో దేశంలోనే ముందున్న మహారాష్ట్ర, వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కర్ణాటక కూడా రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పోటీపడుతున్నాయి. దేశ వ్యవసాయానికి ఉన్న అసలు సమస్యను పరిష్కరించకుండా తాత్కాలిక తాయిలాలు, రుణమాఫీలు, ఫలితంలేని బీమాలతో రైతులకు మేలు చేస్తున్నట్టు పార్టీలు, నేతలు నటిస్తుంటే.. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీల పేరుతో చీలికలుపేలికలైన రైతులు అమాయకంగా జీవితాల్ని సమర్పించుకుంటున్నారు. దేశమంతా ఒకటే మార్కెట్ అని ప్రధానమంత్రి ప్రకటించారు, రాష్ట్రాలు తలూపుతున్నాయిగానీ.. ఇంకా రైతులు స్వేచ్ఛగా తమ ఉత్పత్తులను డిమాండ్ ఉన్న చోట అమ్ముకోవటానికి అనేక జిల్లాల్లో అవరోధాలు కొనసాగుతూనే ఉన్నాయి. 2012లో ఇదే ఫిబ్రవరి మాసంలో రైతులపై ఉన్న మార్కెటింగ్ ఆంక్షలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా చేసిన రైతు సత్యాగ్రహ యాత్ర వల్ల కేవలం ఒక్క సీజన్‌లో తెలుగునాట ఉన్న ఒక్క బీపీటీ ధాన్యం రైతులకే రూ.3,000కోట్ల మేర లాభం చేకూరింది. రైతులు పండించిన పంటకు సాగుఖర్చుపై 50శాతం అదనంగా కలిపి మద్దతు ధరగా ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సు ఆచరణసాధ్యం కాదు కాబట్టి.. రైతుకు స్వేచ్ఛా మార్కెట్ చుట్టూ ఆదాయం వచ్చే మార్గాలు మేలని లోక్‌సత్తా తొలినుంచీ పరిష్కారాలు చెబుతోంది. కానీ కమిషన్ చెప్పిన మద్దతు ధర ఇస్తామని 2014 ఎన్నికల్లో మోదీ, తెలుగు రాష్ట్రాల పాలకులు ఓట్లు కొల్లగొట్టారు. మోదీ ప్రభుత్వం ప్రస్తుతం ఆ ఊసు ఎత్తకుండా తప్పించుకుంటోంది. రాష్ట్రాలు మాత్రం ఇప్పటికీ కూడా మద్దతు ధరపై ఆచరణసాధ్యంకాని ఆ డిమాండ్‌నే కొనసాగిస్తూ రైతులను మోసం చేస్తున్నాయి. టమాటా రైతులు పంట నష్టపోకుండా ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించటం, ధాన్యం రైతులు అయినకాడికి పంట తెగనమ్ముకోకుండా ప్లెడ్జి రుణాలు అందించటం చేతగాని ముఖ్యమంత్రులు.. ఆచరణసాధ్యంకాని మద్దతు ధర, అసంబద్ధ ఎత్తిపోతల ప్రాజెక్టుల గురించి ఊదరగొట్టటంలో మాత్రం ముందుంటున్నారు. డీమానిటైజేషన్‌తో బ్యాంకుల వద్ద పుష్కలంగా డబ్బు ఉంది కాబట్టి.. రైతులకు, వ్యవసాయాధారిత చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నిర్వహించే ఔత్సాహికులకు తక్కువ వడ్డీకి రుణాలివ్వాలి. ప్లెడ్జి రుణాలను ప్రోత్సహించాలి. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించేలా గ్రామీణ రంగాలకు సరైన పరపతి వ్యవస్థను సహకార రంగాన్ని అనుసంధానం చేస్తూ ఏర్పరచాలి. అనుత్పాదక, నిరర్థక రుణాల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇక రెండోది వైద్యం. ఈదేశంలో వ్యవసాయదారులు సహా ఎక్కువమంది జీవించే చాలా గ్రామాలకు శిక్షణ పొందిన వైద్యుడు అందుబాటులో లేరు. అందుబాటులో ఉన్న పట్టణ ప్రాంతాల్లోనేమో అత్యధికులకు నాణ్యమైన చికిత్సను అందుకోలేని దుస్థితి! చికిత్స కోసం ప్రజలు తమ జేబుల్లో నుంచి ఏటా రూ.4లక్షల కోట్లు ఖర్చుపెడుతున్నారు. కేవలం వైద్య చికిత్స కోసం చేసే అప్పులు తీర్చలేక దేశ జనాభాలో ఏటా 10 లక్షల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. అనేకమంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవటానికి ప్రధాన కారణాల్లో వైద్య ఖర్చులూ ఒకటి. విత్తనం దగ్గర్నుంచి మార్కెటింగ్ వరకూ విధానపరమైన మార్పులు చేయటంతోపాటు.. వైద్యాన్ని వారికి అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు చేస్తే రైతులకు ఆదాయపరంగా ఎంత ఊరట కలుగుతుంది! అలాగే వ్యవసాయంలో ఎంత ఆదాయాన్ని పెంచినా ఒకమేర మించి సాధ్యంకాదు కాబట్టి.. ఆ రంగం మీద ఆధారపడినవారు ఇతరత్రా రంగాల్లో గౌరవప్రదంగా ఉపాధి పొందేలా రైతుబిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాల్సుంది. నిజానికి నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అన్ని రంగాలలో వారికీ ఉచితంగా అందించాల్సిన ప్రాథమిక బాధ్యతను ప్రభుత్వాలు నెరవేరిస్తే.. వ్యవసాయం సహా దేశవ్యాప్తంగా అన్ని రంగాలలోని ప్రజలకూ సమస్యలు చాలా తీరతాయి. కానీ దేశాన్ని బాగుచేయటానికి కీలకమైన విద్య, ఆరోగ్య రంగాల గురించే మాట్లాడని ప్రభుత్వాలున్న వ్యవస్థలోనే కొనసాగుతున్నాం. ఇదేతీరుగా వెళ్తే.. ప్రాథమిక విద్యలో 2051కిగానీ, మాధ్యమిక విద్యలో 2062కిగానీ, ఉన్నత విద్యలో 2087కిగానీ మనం ఇప్పుడున్న ప్రపంచ ప్రమాణాలను అందుకోలేమని యునెస్కో ప్రకటించింది. వైద్యంలో ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రజాస్వామ్య దేశాలకంటే కూడా అధ్వాన్నంగా ఉన్నాం. సంపద అసమానతలు ప్రపంచ సగటు కంటే భారత్‌లోనే అధికమని, దేశ సంపదలో 58శాతం కేవలం ఒక్కశాతం వద్దే కేంద్రీకృతమై ఉందని ఇటీవల వెల్లడించిన ఆక్స్‌ఫామ్ అనే హక్కుల సంస్థ కూడా.. ఈ దారుణ అప్రజాస్వామికతను సరిచేయటానికి విద్య, వైద్యాల్లో కేటాయింపులు పెరగటమే కీలకమని స్పష్టంచేసింది. 57మంది భారతీయ బిలియనీర్ల మొత్తం సంపద దేశ జనాభాలో 70శాతం మంది సొమ్ముతో సమానమని తెలిపింది. గత ఇరవై ఏళ్లలో సంపన్నుల సంపద 15శాతం కంటే ఎక్కువ పెరిగితే, దిగువస్థాయిలోని పదిశాతం మంది పేదల ఆదాయం 15శాతం కంటే ఎక్కువ దిగజారిందని, ఇందులోనూ స్త్రీ-పురుష అసమానతలున్నాయని నివేదిక హెచ్చరించింది. వివక్ష లేకుండా అందరి ప్రజల జీవితాల్ని నిజంగా మార్చటానికి అవసరమైన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించి భారతదేశాన్ని జీవనయోగ్యంగా మార్చటం, ప్రపంచీకరణ దుష్పరిణామాలు సోకకుండా అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం వంటి చర్యలు లేకుండా.. కేవలం సంపన్నులు సృష్టించే ఆదాయం గురించే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి మీద పనికిరాని, బూజుపట్టిన స్కీముల్ని, తాయిలాల్ని చిలకరించే పాలకుల్ని ఇంకెంతకాలం ఆరాధిస్తాం?.. సోషల్ మీడియా యుగంలోనైనా వాస్తవాల ఆధారంగా ఆలోచించలేమా?

మీ
జయప్రకాష్

# కార్టూన్ కార్నర్



మక్కెలిరగదీస్తా!
ఏ హోదాతో అడుగుతున్నావ్!!

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రైతు ఆత్మహత్యల్లో ముందున్న 'రుణమాఫీ' రాష్ట్రాలు

రుణమాఫీల చుట్టూ కాకుండా రైతులకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాల్ని రూపొందించకపోతే వినాశకర ఫలితాలొస్తాయన్న లోక్‌సత్తా హెచ్చరికనే తాజా గణాంకాలు సైతం ఉద్ఘాటిస్తున్నాయి. తెలంగాణలో రుణాలే రైతుల పాలిట బలవన్మరణ పాశాలుగా మారుతున్నాయని 'జాతీయ నేర గణాంకాల మండలి' విడుదల చేసిన నివేదిక - 2015 తెలిపింది. దేశవ్యాప్తంగా 2015లో ఆత్మహత్య చేసుకున్న రైతుల గణాంకాలపై గతంలో ప్రాథమిక నివేదిక విడుదల చేసిన మండలి.. ఇప్పుడు తుది గణాంకాలను వెల్లడించింది.

రాష్ట్రాలవారీగా చూస్తే మహారాష్ట్ర తరువాత అత్యధిక మంది రైతులు ఆత్మహత్య చేసుకున్న రాష్ట్రంగా తెలంగాణ రెండో స్థానంలో ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2015లో 44.9శాతం మేర పెరిగాయి. దేశవ్యాప్తంగా నమోదైన ఈ తరహా ఆత్మహత్యలలో ఏపీ ఆరోస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో జరిగిన మొత్తం ఆత్మహత్యలలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నవారి శాతం 14.71గా ఉంది. పంట నష్టాలు, అప్పులు తీర్చలేక పోవటం వంటివి ఈ బలవన్మరణాలకు కారణ మవుతున్నాయి.




**నివేదికలో ముఖ్యాంశాలు :**

- 2015లో దేశం మొత్తం మీద వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నవారిలో 12,602 మంది ఆత్మహత్యలు చేసుకోగా.. వారిలో 8,007 మంది రైతులు, 4595మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. మహారాష్ట్ర - 3030, తెలంగాణ - 1358, కర్ణాటక - 1197, ఛత్తీస్‌గఢ్ - 854, మధ్యప్రదేశ్ - 581, ఆంధ్రప్రదేశ్ -516 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ రాష్ట్రాల్లోనే మొత్తం 94.1శాతం ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా రైతులకంటే వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు ఎక్కువగా ఉండగా, ఏపీలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయి.
- అభివృద్ధి చెందిన రాష్ట్రాలున్న దక్షిణ భారతంలో రైతుల ఆత్మహత్యలు పెద్ద సంఖ్యలో ఉండగా.. బీహార్, పశ్చిమ బంగ, జార్ఖండ్ వంటి రాష్ట్రాలతో పాటు గోవా, హిమాచల్‌ప్రదేశ్, కాశ్మీర్, మిజోరాం, నాగాలాండ్, ఉత్తరాఖండ్‌లలో అసలు ఆత్మహత్యలే నమోదు కాలేదు.
- రైతు కుటుంబాల్లో పుట్టి వ్యవసాయం చేస్తున్నందుకు వివాహం కావటం

## మార్కెటింగే రైతులకు మాస్టర్ కీ



దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి మార్కెటింగ్ లోపమే ప్రధాన అవరోధమని ఆర్థికరంగ నిపుణుడు సీహెచ్ హనుమంతరావు అన్నారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో 'ఆర్గనైజ్డ్ రిటైలింగ్ అండ్ అగ్రి బిజినెస్ – ఇంప్లికేషన్స్ ఆఫ్ న్యూ సప్లయ్ ఛైన్స్ ఆన్ ది ఇండియన్ ఫార్మ్ ఎకానమీ' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకొనేందుకు తగినన్ని కోల్డ్ స్టోరేజీలు రైతులకు అందుబాటులో లేకపోవడం, మార్కెటింగ్ ద్వారా గిట్టుబాటు ధర పొందే మార్గాలు వారికి తెలియకపోవడం ఈ రంగం అభివృద్ధికి అడ్డంకిగా మారాయని హనుమంతరావు వివరించారు.

లేదని 23 మంది ప్రాణం తీసుకున్నారు. వీరిలో అమ్మాయి ఒక్కరు కాగా.. మిగతవారంతా అబ్బాయిలు.

- దేశంలో నేరుగా వ్యవసాయం చేసే రైతులతోపాటు వారి పొలాల్లో నిత్యం శ్రమించే వ్యవసాయ కూలీలు సైతం ఏటా పెద్దసంఖ్యలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. 2015లో మహారాష్ట్రలో 1291మంది, మధ్యప్రదేశ్ 709, తమిళనాడు 604, ఆంధ్రప్రదేశ్ 400, కర్ణాటక 372, గుజరాత్ 244, కేరళ 207మంది రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు.


**ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు :**

- బ్యాంకుల అప్పులు లేదా ఇతర అప్పులు 38.7శాతం, వ్యవసాయపరమైన కారణాలు 19.5, కుటుంబ కారణాలు 11.7, అనారోగ్యం 10.5, మద్యం లేదా మాదక ద్రవ్యాల అలవాటు 4.1శాతం.
- అప్పుల ఊబితో రైతులు ఆత్మహత్య చేసుకున్న రాష్ట్రాల్లో కర్ణాటక 79శాతం, తెలంగాణ 46.5శాతంతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.
- చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మొత్తం ఆత్మహత్యలలో వీరిది 72.6శాతం.
- పంటలు దెబ్బతిన్నప్పుడు తట్టుకునే శక్తి రైతులకు ఉండటం లేదు. అంతకుముందు ఏడాది ఆదాయం మిగలకపోవటంతో దిక్కుతోచక వందలాదిమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

**పంటలు దెబ్బతిన్నప్పుడు తట్టుకునే శక్తి రైతులకు ఉండటం లేదు. అంతకుముందు ఏడాది ఆదాయం మిగలకపోవటంతో దిక్కుతోచక వందలాదిమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.**

- నిబంధనల ప్రకారం పాతిక ఎకరాలకన్నా ఎక్కువ భూమి కలిగివున్నవారిని 'పెద్ద రైతు'గా పిలుస్తారు. దేశవ్యాప్తంగా 2015లో 160మంది పెద్దరైతులు ఆత్మహత్య చేసుకుంటే వారిలోనూ 79శాతం మంది తెలంగాణలో ఉన్నారు.
- ఏపీలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల్లో 313మంది (60.65శాతం) పంట నష్టాలు, అప్పులు తీర్చలేకే అందుకు పాల్పడ్డారు. 2014లో ఈరెండు కారణాలతో కలిపి మొత్తం 78మంది మాత్రమే ఆత్మహత్య చేసుకోగా 2015లో మాత్రం ఈ సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. మొత్తం రైతుల ఆత్మహత్యలు కూడా దాదాపు మూడున్నర రెట్లు (160 నుంచి 516కు) పెరిగాయి. దేశవ్యాప్తంగా 52శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల ఊబిలో ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌లో 93శాతం, తెలంగాణలో 89శాతం రైతులు అప్పుల్లో ఉన్నారు.
- ఆత్మహత్యల్లో 30 నుంచి 60ఏళ్లలోపు రైతులే 71.6శాతం ఉన్నారు. 30 ఏళ్లలోపు రైతులు 1,513మంది ప్రాణం తీసుకున్నారు.

# ఇప్పటికీ అధిక వడ్డీ వ్యాపారులే దిక్కు



దేశంలో అత్యధిక శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగానికి రుణం నేటికీ అత్యంత సమస్యాత్మకంగా ఉందని పార్లమెంటు స్థాయీ సంఘం ధృవీకరించింది. ఎక్కువమంది రైతులు వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారని, తరచూ అధికవడ్డీల దోపిడీ బారిన పడుతున్నారని పేర్కొంది. బ్యాంకుల ద్వారా ఇస్తున్న రుణాల మొత్తం పెరుగుతున్నా అవసరాలకు సరిపడా అందటం లేదని తెలిపింది. గ్రామీణ వ్యవసాయ, బ్యాంకింగ్, బీమాకు సంబంధించిన స్థాయీ సంఘం పార్లమెంటుకు ఇటీవల నివేదిక అందచేసింది. వ్యవసాయ రుణ విధానాల మార్పు కోసం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల బోర్డులో వ్యవసాయ రంగ ప్రతినిధులు, నిపుణులు ఉండేలా ఆర్‌బీఐ మార్గదర్శకాలను రూపొందించాలని సిఫార్సు చేసింది. నాబార్డ్ ఆధ్వర్యంలో వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు, రుణ అవసరాలపై సర్వే చేయాలని తెలిపింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొంది. స్థాయీ సంఘం చేసిన మరికొన్ని సూచనలు :

- ఇప్పటికీ వడ్డీ వ్యాపారులు, సూక్ష్మ రుణ సంస్థలు, స్వయం సహాయక సంఘాలే గ్రామీణ రుణాల్లో కీలకం. బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణ మొత్తం పెరుగుతున్నా సరిపోవడం లేదు. వ్యవసాయ రంగానికి 18శాతం రుణాలు ఇవ్వాలనే వాణిజ్య బ్యాంకుల లక్ష్యం పూర్తిగా భరోసా ఇవ్వగలిగేది కాదు. ఇబ్బంది లేకుండా రైతులకు రుణాలు అందించేలా ఆర్‌బీఐ, నాబార్డ్ చూడాలి. గ్రామీణ, సంప్రదాయ, కులవృత్తులపై ఆధారపడినవారికి, మత్స్యకారులు, జానపద కళాకారులకు రుణాలు అందించటంపై దృష్టి సారించాలి.
- రైతులతో స్వయంసహాయక సంఘాలను ఏర్పాటు చేయాలి. రివాల్వింగ్ ఫండ్ సమకూర్చి రుణాలు అందించాలి
- ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల వ్యవస్థను పటిష్టం చేయాలి. నాబార్డ్ నేరుగా రుణాలిచ్చే అంశంపై దృష్టి సారించాలి
- కిసాన్ క్రెడిట్ కార్డులు పెట్టుబడి అవసరాలను పూర్తిగా తీర్చడం లేదు. ఈ కార్డుల రుణపరిమితిని పెంచాలి. కిసాన్ క్రెడిట్ కార్డులను భూమి రికార్డులు, జన్‌ధన్ బ్యాంకు ఖాతా, ఆధార్‌తో అనుసంధానం చేయాలి.

## ఆ దుర్మార్గపు సెక్షన్లకు వ్యతిరేకంగా తెలంగాణ, ఏపీ ఎంపీలు గళం విప్పాలి

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అవినీతి వ్యతిరేక చట్ట సవరణ బిల్లులోని దుర్మార్గపు సెక్షన్లకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పార్లమెంటు సభ్యులు పార్టీలకతీతంగా గళం విప్పాలని లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ డిమాండ్ చేసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో లోక్‌సత్తా 2.0 నేత ఎన్.శ్రీనివాస్, ప్రకాష్ హోల్లాతో కలిసి సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు మాట్లాడారు. ఆ సవరణలకు ఆమోదం లభించి చట్టంగా మారితే.. ప్రభుత్వాధికారులకు నిస్సహాయంగా లంచమిచ్చే సామాన్యులకు శిక్ష, లంచాలు పిండే అధికారులకు మాత్రం రక్షగా మారుతుందన్నారు. లంచగొండి ప్రభుత్వోద్యోగుల దర్యాప్తు చేయటానికి కూడా ముందస్తు అనుమతి కావాలనటం ఈదేశంలో రెండు రకాల పౌరులున్నారని చెప్పటమేనన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అన్న రాజ్యాంగాన్ని అపహాస్య చేయటమేనన్నారు. ప్రభుత్వ విధానపరమైన అంశాలలో మాత్రమే అధికారులకు రక్షణ కల్పించాలని, దేశాన్ని దోచుకునేందుకు లంచం ఇచ్చినవారి మీదే కేసులు బనాయించాలని అన్నారు. ఈరకమైన సవరణలు తిరిగి చేయాలన్నారు. ప్రజలకు సర్కారీ కార్యాలయాల్లో లంచాలులేని సేవలు అందేందుకు పౌరసేవల చట్టాన్ని వెంటనే తీసుకురావాలన్నారు. ఈ అంశాలన్నిటి మీదా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు.


# పంట బీమాకు రుణాల దెబ్బ



తెలంగాణలో ప్రస్తుత యాసంగి (రబీ) కాలంలో సాగుచేసిన పంటల్లో కనీసం సగం విస్తీర్ణంలోని పంటలకైనా బీమా వర్తించే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ, పాత నోట్ల రద్దు, నోట్ల మార్పిడి, బీమా కంపెనీల నిర్వాకం.. వెరసి రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకుండా తప్పించుకునేలా చేశాయి. ఈ వ్యవసాయ కాలానికి 2016 అక్టోబర్ నుంచి రూ.13వేల కోట్లకు తగ్గకుండా పంట రుణాలు ఇవ్వాలి. కానీ డిసెంబర్ 31 వరకు రూ.5,055కోట్లే ఇచ్చినట్టు బ్యాంకర్లు వ్యవసాయ శాఖకు సమాచారమిచ్చారు. జనవరి వచ్చాక మరో రూ. 1,500కోట్లు ఇచ్చినట్టు అంచనా. అంతా కలిపినా నిర్ణీత రూ.13,000కోట్లలో సగం వరకే పంపిణీ అయినట్లు వ్యవసాయ శాఖ లెక్కలేస్తోంది. యాసంగిలో రాష్ట్రంలో సాధారణ పంట సాగు 30లక్షల ఎకరాల లక్ష్యాన్ని చేరుకోకపోవటం వెనక బ్యాంకులు రుణాలివ్వకపోవటం పెద్ద కారణంగా ఉంది. పెట్టుబడి సొమ్ము దొరక్క రైతులు బాగా ఇబ్బందిపడ్డారు. రైతుకిచ్చే పంట రుణం నుంచి పంట బీమాకు సంబంధించిన ప్రీమియం సొమ్మును బ్యాంకు మినహాయించుకుని బీమా కంపెనీకి పంపాలి. అసలు రుణాలే తగినన్ని ఇవ్వకపోవటంతో బీమా వర్తించే అవకాశం చాలామంది రైతులకు లేకుండా పోయింది. వాస్తవానికి బీమాకు ప్రీమియం చెల్లింపు గడువు డిసెంబర్ 30తోనే తొలుత ముగిసింది. కానీ నోట్ల రద్దు వల్ల బ్యాంకులు రుణాలివ్వలేదని జనవరి 10 వరకు పొడిగించారు. రుణం తీసుకోలేని రైతులు నేరుగా ప్రీమియం సొమ్ముకు బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ తీసి బీమా సంస్థకు దరఖాస్తుతో సమర్పించాలి. పంట రుణాలు తీసుకోని రైతులు పలు జిల్లాల్లో చాలా తక్కువమంది ప్రీమియం కట్టినట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లాలో వరి, వేరుసెనగ పంటలు సాగుచేసిన రైతుల్లో 4,000మంది, గద్వాలలో సెనగ, జన్న రైతులు మరో 4,000మంది, వనపర్తిలో వేరుసెనగ రైతులు వెయ్యిమంది, నాగర్‌కర్నూలులో వేరుసెనగ, వరి రైతులు 2,000మంది రైతులు మాత్రమే డీడీలు తీసి దరఖాస్తు చేసినట్టు తెలుస్తోంది. భద్రాద్రిలో వరి, మొక్కజన్న సాగుచేసిన రైతులు కేవలం 500మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఖరీఫ్ కాలం నుంచే 'ప్రధానమంత్రి పంటబీమా పథకం' ప్రారంభమైంది. తొలి సీజన్‌లో బీమా కంపెనీలు సహకరించనందున రైతులు బీమా పరిధిలోకి రాలేదు. ఇప్పుడు యాసంగిలోనూ కంపెనీల సహకారం లేకపోవటం వల్ల మారుమూల ప్రాంతాల్లో రైతులకు దరఖాస్తుల్ని ఇవ్వలేకపోయామని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం అమలు బాధ్యతను యాసంగిలో రెండు ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించారు. ఈ కంపెనీల ఏజెంట్లు గ్రామాలకు వెళ్లి రైతుల నుంచి డీడీలు, దరఖాస్తులు తీసుకోవాలి. కానీ నిరక్షరాస్యులైన రైతులకు అవగాహన కలిగించేందుకు వారు పెద్ద ప్రయత్నం చేయలేదు. అధికారులు నిర్లక్ష్యం మీద కంపెనీలు ఎదురు ఆరోపణలు చేస్తున్నారు.

ఖరీఫ్‌లో 36 లక్షలమంది రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇస్తాయని సీజన్ ఆరంభంలో వ్యవసాయ శాఖ ప్రకటించింది. కానీ ఖరీఫ్ లక్ష్యం రూ. 17,500కోట్లలో సగం కూడా రుణాలివ్వలేకపోయారు. కొన్ని బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వకుండానే ఇచ్చినట్టు సర్దుబాట్లు (బుక్ ఎడ్జస్ట్‌మెంట్లు) చేశాయి. ఈ దొంగ లెక్కలు కూడా ఎలా బైటపడ్డాయంటే.. రుణంలో భాగంగా ప్రీమియం వసూలు చేసినట్టు చూపలేకపోవటం వల్ల! మొత్తం మీద 2016 ఖరీఫ్‌లో 8లక్షలమంది రైతులే బీమా పరిధిలోకి వచ్చారు. యాసంగిలో ఆ మాత్రం కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది.

# 'ప్లెడ్జి రుణాలు'...4లక్షల రైతుల్లో 14 మందికే !



ఓట్ల కోసం పోటాపోటీగా రైతులకు రుణమాఫీలు ప్రకటించిన ప్రభుత్వాలు రైతులకు రుణం మాత్రం అందనీయకుండా చేస్తున్నాయి. రైతులకు ఆదాయాన్నందించేందుకు స్వేచ్ఛా మార్కెట్‌తోపాటు.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పుడు మాత్రమే అమ్ముకునే విధంగా గోదాములు, శీతల గిడ్డంగులు, ప్లెడ్జి (పంట తనఖా పెట్టి తీసుకునే) రుణాలు అందించటం కీలకమని లోక్‌సత్తా పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లింది. రుణమాఫీలు చేసినా రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారో కనీస ఆలోచన కూడా చేయని తెలుగు రాష్ట్రాల పాలకులు ఆ ఊసే ఎత్తటం లేదు.

కరీంనగర్‌లో ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి వంటి వారి వలలో రైతులు చిక్కుకుపోవటానికి అధ్వాన్నమైన పరపతి వ్యవస్థే కారణమని తెలిసినా ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేయకపోగా మోహన్‌రెడ్డి మీద చర్యలను నీరుగార్చేలా మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోనైతే అధికారులే దళారుల ద్వారా రైతులను దగా చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. 2014-15లో ఒక సీజన్ పత్తి అమ్మకాల్లోనే ఇలా రూ.1000 కోట్ల కుంభకోణం జరిగింది. రైతులకు పరపతి, మార్కెటింగ్‌లో తోడ్పాటునిచ్చే సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. పంట అవసరాలు, పిల్లల చదువు, కుటుంబ వైద్యం ఇలా రైతుల అవసరాలకు కీలకమైన ప్లెడ్జి రుణాలను బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థల నుంచి ఇప్పించే ప్రయత్నం చేయకపోగా, అలాంటి రుణాల కోసం గతంలో ఎప్పుడో ప్రకటించిన 'రైతుబంధు' అనే పథకాన్ని మరుగున పడేసేలా ఏపీ సర్కారు వ్యవహరిస్తోంది.

రైతుబంధు పథకం గురించి కనీస ప్రచారం కూడా చేయటం లేదు. విజయనగరం జిల్లాలో మొత్తం 4 లక్షల మంది రైతులు 2.37 లక్షల హెక్టార్ల భూమిని సాగుచేసుకుంటుండగా, 2016-17లో కేవలం 14మంది రైతులకు మాత్రమే ఈ పథకం కింద రుణాలిచ్చారు. 2015-16లోనైతే కేవలం 5గురు రైతులకు రూ.7లక్షల వరకు రుణాలిచ్చారు.

### 180 రోజుల వరకూ వడ్డీ చెల్లించనక్కర్లా

రైతులు తమ భూములకు సంబంధించిన యాజమాన్య హక్కు పత్రాలు, భూమి శిస్తు రసీదు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్, బ్యాంక్ ఖాతా నకళ్లను వ్యవసాయ మార్కెట్ కమిటీల అధికారులకు నివేదించినట్టయితే రైతుబంధు పథకం లబ్ధికి ఎంపిక చేసి కార్డులిస్తారు. ఈ కార్డును ఐదేళ్లపాటు వినియోగించుకోవచ్చు. కౌలు రైతులయితే, గుర్తింపు కార్డును చూపాలి. పంటపై పెట్టిన పెట్టుబడులు తీర్చుకోవడానికి గోదాములో రైతు నిల్వ ఉంచిన పంట ఉత్పత్తుల విలువలో 75శాతం వరకు గరిష్టంగా రూ.2లక్షలు మించకుండా వడ్డీలేని రుణం ఇస్తారు. రైతు రుణం తీసుకున్న నాటి నుంచి 180 రోజులవరకు వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. 181వ రోజు నుంచి 270 రోజుల వరకు సరకు విక్రయించకుండా ఉంటే.. తీసుకున్న రుణంపై 12శాతం వడ్డీ పడుతుంది. మార్కెట్ కమిటీ గోదాముల్లో ఉంచిన సరకుకు బీమా సదుపాయం వర్తిస్తుంది. నామమాత్రపు అద్దె, బీమా రుసుములను బస్తాకు రూ.1.20 చొప్పున వసూలు చేస్తారు.

### అధికారులు, పాలకుల అబద్ధాలు

ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు నిల్వ ఉంచకుండా అమ్ముకుంటున్నారని అధికారులు, పాలకులు చెబుతున్న మాటలు వాస్తవం కాదని రైతుల్ని కదిలిస్తే అర్థమవుతుంది.

ప్రభుత్వం ప్రచారం చేయకపోవటంతో రైతుల్లో అవగాహనాలేమి, వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో గోదాములు, సౌకర్యాల కొరత రైతు బంధు అమలులో ప్రతిబంధకాలుగా మారాయి. పండించిన పంటను నిల్వ చేసుకునే వసతి లేని రైతులు వ్యాపారులు అడిగిన ధరకే అప్పగించి నష్టపోతున్నారు.

**లక్షటన్నులపైగా సామర్థ్యం అవసరం.. ఉన్నది వందల టన్నులే**

విజయనగరం జిల్లాలో మూడు మండలాల పరిధిగల చీపురుపల్లి ఏఎంసీలో రైతులు పంట నిల్వ ఉంచుకోవాలంటే లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములు అవసరం. కానీ ఇక్కడ 600 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న నాలుగు గోదాములే ఉన్నాయి. వీటిని కూడా పాడి ప్రొక్యూర్‌మెంట్, పౌరసరఫరాల సరకులు, ఏపీ సీడ్స్ నిల్వలకు అద్దెకిచ్చారు. కొత్తవలస మార్కెట్ యార్డులో గోదాము లేదు. కురుపాం మార్కెట్ కమిటీకి 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న చిన్న గోదాము ఉంది. భైరిపురం మార్కెట్‌యార్డులో మూతపడ్డ గోదామును వాడుకలోకి తెచ్చే ప్రయత్నమే లేదు. అయినకాడికి తక్కువ ధరకే తరచూ పంటలను తెగనమ్ముకుంటున్నారు.

వాస్తవానికి మార్కెట్ యార్డుల్లో గోదాముల నిర్మాణం పూర్తయ్యేదాకా వేచి చూడాల్సిన అవసరం లేకుండా, ప్రతిసారీ మార్కెట్‌యార్డుకు వెళ్లాల్సిన అవసరం కూడా లేకుండా.. గ్రామంలోనే రైతులు తమ ఇళ్ల వద్ద, లేదా గ్రామంలో తాత్కాలికంగా అద్దెకు తీసుకున్న చోట్ల పంటను నిల్వ ఉంచితే బ్యాంకు అధికారులు వచ్చి తనిఖీ చేసి ప్లెడ్జి రుణాలు ఇప్పించవచ్చు. గతంలో ఇలా చేసిన సందర్భాలున్నాయి. ఇళ్ల గదుల్లో పంటను నిల్వ ఉంచితే అధికారులు రుణాలిచ్చే ముందు ఆ గదులకు సీల్ వేస్తారు. రుణం చెల్లించాక వారే తిరిగి తెరుస్తారు. కానీ రైతులకు పరపతి వ్యవస్థను పటిష్టం చేసే చర్యలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పరపతి వ్యవస్థను బలిపెట్టటం వల్ల రైతులు తీవ్రంగా దెబ్బతింటున్నారు. తాజాగా జాతీయ నేర గణాంక వివరాలలో కూడా రైతుల ఆత్మహత్యలకు రుణపాశం పెద్ద కారణంగా ఉంది.

అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో ఎంతమంది రైతులకు ప్లెడ్జి రుణాల్ని అందించారు? పంటలకు న్యాయమైన ధర ఏమేర ఇప్పించగలిగారు?.. ఈ రెంటిపైనా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కె.చంద్రశేఖరరావు శ్వేతపత్రం ప్రకటిస్తే చాలు, లోగుట్టు బైటపడుతుంది.


పాలకులకు, సమాజానికి చిత్తశుద్ధి ఉంటే.. డీమానిటైజేషన్ నేపథ్యంలో బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పుల్ని రైతులకు ప్లెడ్జి రుణాలు సహా పరపతి వ్యవస్థను నిర్మించేందుకు ఒక సదవకాశంగా వినియోగించవచ్చు. రైతులు కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటి స్వల్ప విభేదాలను వీడి ఏకమైతే ఈ లక్ష్యాన్ని సాధించటానికి పెద్ద సమయం పట్టదు.

# రైతులకు ప్రభుత్వం మీద నమ్మకం లేదు



భూసేకరణలో రైతులు, ఇతర భూయజమానులకు ప్రభుత్వాలు న్యాయమైన పరిహారం చెల్లిస్తుందన్న భరోసా లేకపోవటం వల్లే ప్రజలు భూసేకరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ తెలంగాణ రాష్ట్ర నేత సాతులూరి గోవిందరావు అన్నారు. అసంబద్ధమైన ఎత్తిపోతల పథకాలు, సామాజిక అధ్యయనం లేకుండా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణకు హడావుడి పడుతోందన్నారు. మార్కెట్ రేట్లకు ప్రభుత్వం చెబుతున్న పరిహారానికి చాలా అంతరం ఉందన్నారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలకనుగుణంగా, వారి జీవనభద్రతకు భరోసానిస్తూ భూసేకరణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో జిల్లా అధ్యక్షులు ఈర్జాల రాంబాబు, రావిళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాలలో గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకులు రహీం, శ్రీకాంత్, నరేష్, రమేష్, అచ్యుత్, నరేంద్ర, సైదాబాబు, యమున తదితరులు హాజరయ్యారు.

# అంకెల రంకెలకు, వాస్తవాలకు లంకె కుదరడం లేదు, తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం: నిపుణుల నివేదిక .. పలు సిఫార్సులు


ఆర్.రాధాకృష్ణ

వ్యవసాయ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ టాప్ టెన్ స్థానాల్లో ఉందని నీతి ఆయోగ్ ఒకపక్క ఢిల్లీలో సర్టిఫికెట్ ఇస్తుండగానే, రాష్ట్రంలోని రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని, బహుముఖ సంస్కరణలు లేకపోతే వ్యవసాయదారులను కాపాడుకోవటం కష్టమని నిపుణుల కమిటీ ఏపీని హెచ్చరించింది. దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలోని వ్యవసాయ కుటుంబాలలో 93శాతం అప్పుల్లో కూరుకుపోయి వున్నారని తెలిపింది. ఇటీవలికాలంలో వ్యవసాయ వృద్ధి చాలా వేగంగా ఉన్నట్టు నమోదవుతున్న లెక్కలు సందేహాస్పదమని వ్యాఖ్యానించింది.


"ఆంధ్రప్రదేశ్ రైతులు ఎంతో సంక్షోభంలో ఉన్నారు. ప్రత్యేకించి సన్న, చిన్నకారు, కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. గడచిన దశాబ్దకాలంలో సాగువ్యయం రెట్టింపవగా.. రాబడి మాత్రం తగ్గిపోయింది. వ్యవసాయం ఏమాత్రం లాభసాటిగా లేదు. పంటల ధరలు దారుణంగా పడిపోవడం, మార్కెటింగ్ మెళకువలు తెలియకపోవడం, బీమా అందకపోవడం తదితర కారణాల వల్ల రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు" అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సెస్' (సామాజిక ఆర్థిక అధ్యయనాల సంస్థ) ఛైర్మన్ ఆర్.రాధాకృష్ణ నేతృత్వంలో నియమించిన కమిటీ తేల్చింది. ప్రొఫెసర్లు డి.నరసింహారెడ్డి, ఎస్.ఆర్ హాసీం, షీలా భల్లా, గాలబ్, కె. హనుమంతరావు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ రాష్ట్రమంతటా పర్యటించి రూపొందించిన నివేదికను ఇటీవల ఏపీ ప్రభుత్వానికి అందించింది.

చిన్న, సన్నకారు, కౌలు రైతులు ఎక్కువగా ఉండటం, విద్య, వైద్యం తదితర అవసరాల్లో వ్యయం పెరగటం వల్ల వ్యవసాయంలో ఒడిదుడుకులు తీవ్రంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. నాణ్యమైన విత్తనాలు,ఎరువుల సరఫరా, పెట్టుబడి వ్యయాన్ని అందించడం, సహకార, మార్కెటింగ్ సంస్కరణల్ని పెద్దఎత్తున తీసుకురావటంతోపాటు చిన్న, సన్నకారు రైతులకు నైపుణ్య శిక్షణనిచ్చి వ్యవసాయేతర రంగాల వైపు మళ్లించాలంటూ కమిటీ 134 సిఫార్సులను చేసింది. కేరళలో రైతులు లక్షా 25వేల మంది చిన్న రైతులతో ఉన్న 265 ప్రాథమిక వ్యవసాయ మార్కెట్లు, వ్యవసాయ కూలీల్లో పేదరిక నిర్మూలనకు చేపట్టిన కుడంబశ్రీ కార్యక్రమం, అనంతపురంలోని టింబక్టు సేంద్రీయ వ్యవసాయం, జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) కర్ణాటక, కొన్ని ఈశాన్య రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన సఫల్ కంపెనీ అగ్రి బిజినెస్, మార్కెట్ల తరహాలోని రైతుబజార్లు, రైతు సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి మార్కెటింగ్ వరకూ సరైన సూచనలిచ్చే పంజాబ్ రైతు కమిషన్ వంటి నమూనాలను అనుసరించి వ్యవసాయాన్ని బాగు చేయాలని సూచించింది. స్థూలంగా లోక్‌సత్తా తొలి నుంచీ వాదిస్తున్నట్టు.. వ్యవసాయ కమిటీలను, మార్కెట్లను రైతులకే అప్పజెప్పి, రైతులకు ఆదాయం చుట్టూ, వారి కుటుంబాలకు విద్య, ఆరోగ్యం అందించటం చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు లేని సేవలను అందించటం చుట్టూ నూతన వ్యవసాయ విధానాల్ని అమలుచేయటమే వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమని కమిటీ పేర్కొంది.

**ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు వర్తించే ఈ నివేదికలోని కొన్ని వివరాలు:**

### సాగువ్యయం రెట్టింపైంది

"గత దశాబ్దకాలంలో (2002-2010) సాగువ్యయం రెట్టింపైంది. దీనికి తగ్గట్టుగా పంటల ధర లభించకపోవడంతో వ్యవసాయం ఏమాత్రం లాభసాటిగా లేదు. 1965-2014



మధ్య విశ్లేషణకు పరిగణలోకి తీసుకున్న అన్ని పంటల్లోనూ నష్టమే వచ్చింది. చెరకు, మినుములు లాంటి పంటల్లో మాత్రమే ఎక్కువ సంవత్సరాలు ఆదాయం లభించింది. ప్రధాన ఆహార పంటలు సహా మిగిలిన అన్నింటిలోనూ నష్టమే వచ్చింది.

జొన్న, రాగి, మొక్కజొన్న, వేరుసెనగ పంటలు సాగుచేసిన రైతులు ఎక్కువ సంవత్సరాలు నష్టాలు చవిచూశారు.

ఈ వాస్తవాలు.. ఇటీవలికాలంలో చాలా వేగంగా ఉన్నట్టు నమోదవుతున్న వ్యవసాయ వృద్ధి సుస్థిరతపై సందేహాలను రేకెత్తిస్తున్నాయి.

పండ్ల తోటల పెంపకంలో వృద్ధి బాగున్నా, వర్షాధార ప్రాంతాల్లో నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. వ్యవసాయ వృద్ధి రేటులో 2003-2013 మధ్య పరిశీలిస్తే.. రాష్ట్ర సరాసరి కంటే కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాలు ఎక్కువ సాధించాయి. వ్యవసాయపరంగా ఎక్కువ అభివృద్ధి సాధించిన పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలు రాష్ట్ర సరాసరికి దగ్గర మాత్రమే వున్నాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు వృద్ధిరేటులో రాష్ట్ర సరాసరి కంటే చాలా తక్కువగా వున్నాయి.

## మద్దతు ధర నామమాత్రం-93శాతం రైతులకు అవగాహన లేదు

కనీస మద్దతు ధర పెట్టుబడి వ్యయానికి ఏమాత్రం సరిపోవటం లేదు. కొన్ని పంటలకైతే మద్దతు ధర కంటే పంట తీసుకోవడానికి అయ్యే ఖర్చు ఎక్కువగా ఉందని సెస్ నివేదిక స్పష్టం చేసింది. బ్యాంకుల నుంచి రుణాలందక, మార్కెట్ సదుపాయం లేక ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రవాణా ఛార్జీలు ఎక్కువగా ఉండటం వల్ల చాలామంది రైతులు మద్దతు ధర కంటే కూడా తక్కువగా స్థానిక వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

వాణిజ్య పంటలైన ఉల్లి, మిర్చి, పత్తి పంటల ధరల్లో ఏటికేడాది, ఒకే సంవత్సరంలోనూ చాలా వ్యత్యాసాలు ఉంటున్నాయి. పెట్టుబడి వ్యయానికి, కనీస మద్దతు ధరకు వ్యత్యాసం పెరిగిపోతుండటం ఆందోళనకర అంశం.


రాష్ట్రంలో దాదాపు 93శాతం రైతులకు మద్దతు ధరపై అవగాహన లేదు. పంటలను కొనుగోలు చేసే రాష్ట్ర సంస్థల నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నా, వీరికి కనీస మౌలిక సదుపాయాలు లేవు" అని నివేదిక పేర్కొంది.

ఉత్పాదకతలోనూ జిల్లాల మధ్య చాలా వ్యత్యాసాలున్నాయి. వ్యవసాయం మీద ఆధారపడినవారికి సాగు, పశు

సంపదపై వచ్చే ఆదాయాన్ని కలిపినా కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు.

వంటల బీమా విధానం కూడా విఫలమైంది. కనీస మద్దతు ధర అందనప్పుడు రైతులు నష్టపోకుండా చూసేందుకు ఎలాంటి యంత్రాంగం లేదు. భారమైనా విద్య వంటి మానవాభివృద్ధి రంగాల మీద రైతులు వెచ్చిస్తున్నారు" అని నివేదిక పేర్కొంది.



**కుటుంబానికి రూ.1.23 లక్షల అప్పు-ప్రభుత్వ పెట్టుబడి తగినంతగా లేదు**

రైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు విస్తరిస్తున్నామని చెబుతున్నా, రుణమాఫీ చేశామంటున్నా 93శాతం రైతు కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయి వున్నాయని నివేదికలో తేలింది. పరపతి వ్యవస్థ అధ్వాన్నంగా, అసమర్థంగా ఉండటంతో ఎక్కువమంది రైతులు వడ్డీ వ్యాపారుల మీదే ఆధారపడుతున్నారని కమిటీ తెలిపింది. "2012-13 లెక్కల ప్రకారం ఒక్కో వ్యవసాయ కుటుంబానికి సరాసరి రూ. 1.23లక్షల అప్పు ఉంది. ఇది దేశంలోనే అధికం. రైతు అప్పుల్లో సగం తినడానికి, ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణాలకు చేస్తున్నవే. బ్యాంకులిచ్చే కొద్దిపాటి రుణాలతో రైతులు వ్యవసాయంలో సుస్థిరత సాధించడం అనుమానమే. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి తగినంతగా లేదు. ప్రైవేటు పెట్టుబడే ఎక్కువగా ఉంది. ఎక్కువభాగం కౌలులో ఉండడం కూడా ఓ కారణం. అప్పుల భారం, వ్యవసాయ ఖర్చులు ఎక్కువగా ఉండి ప్రత్యామ్నాయ ఉపాధి లేని వెనకబడిన, గిరిజన ప్రాంతాల్లోని పరిస్థితులు కొందరు రైతులను ఆత్మహత్యల వైపు మళ్లిస్తున్నాయి. పరిస్థితిలో మార్పు రావడానికి ఆర్థిక సంస్థలు వినూత్న పద్ధతులను అనుసరించడం అవసరం" అని పేర్కొంది.

**56 శాతం వర్షాధారమే**

ఆంధ్రప్రదేశ్‌లో 56శాతం వ్యవసాయం వర్షాధారమే. వర్షాధార సాగు ప్రాంతాల్లో పేదరికం కూడా ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో దిగుబడుల్లోనూ వ్యత్యాసాలున్నాయి. ప్రకృతి వనరుల ఆధారంగా ప్రాంతాలను గుర్తించి అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉంది.

వర్షాధార ప్రాంతాల్లో భూగర్భ జల వినియోగంలో

**రైతుల ప్రయోజనాలు పట్టని మార్కెట్ కమిటీలు**

రాష్ట్రంలోని రైతులు వ్యవసాయ మార్కెట్‌లలో తమ ఉత్పత్తులకు న్యాయమైన ధరను పొందలేకపోతున్నారని నివేదిక ధృవీకరించింది. మార్కెట్ కమిటీలు రైతుల ప్రయోజనాలకు తగ్గట్టు పనిచేయటం లేదని నివేదిక పేర్కొంది.

కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి ఎక్కువ వసూలు చేస్తున్నారు. వ్యాపారులు కుమ్మక్కయి మామిడి, టమాటా, పాల ఉత్పత్తుల రైతులను దగా చేస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో తూకాల మోసం కూడా జరుగుతోంది. గిరిజన సహకార సంస్థ ఏర్పాటయినా, దీని మీద గిరిజనులకు నమ్మకం లేకుండా పోయింది.

వ్యవసాయ మార్కెట్ కమిటీలతో సహా పలు విభాగాల్లో ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని కమిటీ సిఫార్సు చేసింది.

## నివేదికలోని ఇంకొన్ని ముఖ్యాంశాలు:

- ఏపీ వ్యవసాయరంగంలో సన్న, చిన్నకారు రైతుల సంఖ్య పెరుగుతోంది.
- కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సుస్థిర వ్యవసాయ పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి.
- సన్న, చిన్నకారు రైతుల జీవనోపాధికి, భద్రతకు వ్యవసాయం భరోసా ఇవ్వడం లేదు. ప్రత్యేకించి వ్యవసాయాధారిత ప్రాంతాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.
- ధనిక రైతులు వ్యవసాయం చేయడం లేదు. కౌలు చట్టాల్లో మార్పులు, చిన్నకారు రైతులను వ్యవసాయేతర రంగాలకు మళ్లించడం, ఇందుకోసం నైపుణ్య శిక్షణనివ్వడం, వ్యవసాయం చేయని ధనిక రైతులు భూమిని లీజుకివ్వడం లేదా అమ్మడానికి ప్రోత్సాహాలు కల్పించాలి.
- రాష్ట్రంలో సగానికిపైగా సాగు విస్తీర్ణం వర్షాధారమే కాబట్టి ఇక్కడ వనరుల వినియోగ సామర్థ్యం, ప్రత్యేకించి నీటి వినియోగ సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి.
- రైతులు అవసరమైన పెట్టుబడి వ్యయాన్ని సగానికి పైగా అనధికార సంస్థలు, వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి తీసుకుంటున్నారు.
- పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వల్ల సాగు విస్తీర్ణం తగ్గుతోంది.
- అధిక మోతాదులో వినియోగిస్తున్న ఎరువులు, క్రిమిసంహారక మందుల వల్ల భూసారం దెబ్బతింటోంది. సేంద్రియ సాగుకు అనుగుణంగా మార్కెట్ వృద్ధి చెందలేదు. కౌలు రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని భరించే స్థితిలో లేరు.
- తరచూ సంభవిస్తున్న తుఫాన్లు, కరవులను తట్టుకోవడానికి అవసరమైన వనరులు రైతులకు లేవు.

సంస్కరణల ప్రయత్నం, నీటి సంరక్షణ చర్యలు, భూసార సంరక్షణ చర్యలు తగినంతగా లేవు.

654 గ్రామీణ మండలాలకుగాను 129 మండలాల్లో వనరులు బహు తక్కువగా ఉన్నాయి. ఇందులో అత్యధికం అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల్లో ఉన్నాయి.

### 33.8శాతం కౌలురైతుల చేతుల్లోనే..

"ఏపీలో కౌలురైతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో 60.73లక్షల హెక్టార్ల భూమి సాగులో ఉంటే ఇందులో 20.53లక్షల హెక్టార్లు (33.8శాతం) కౌలులో ఉంది. కేవలం కౌలు మాత్రమే చేసేవారు 6లక్షలు ఉండగా, కొంత సొంతభూమి వుండి కౌలుచేసేవారు 18లక్షల వరకూ ఉన్నారు. కౌలు కోస్తాంధ్రలో ఎక్కువగా ఉంది. ఉత్తరాంధ్రలో 1.2 లక్షలు, రాయలసీమలో 6.66లక్షలు ఉండగా, ఈ రెండు ప్రాంతాల్లో కౌలులో ఉన్న భూమి 0.5లక్షలు, 4.24లక్షల హెక్టార్లు మాత్రమే. కౌలులో ఎక్కువ భాగం అనధికారమే. ఈ ప్రభావం వ్యవసాయంలో పెట్టుబడిపై ప్రభావం చూపిస్తుంది" అని నివేదిక తెలిపింది.

### 142 లక్షలకు పెరిగిన సంఖ్య

వ్యవసాయం మీద ఆధారపడినవారి సంఖ్య 2011 నాటికి 142లక్షలకు పెరిగిందని నివేదిక పేర్కొంది. వ్యవసాయదారులు, కూలీలు 1961లో 82లక్షలు ఉంటే, 2001 నాటికి 135 లక్షలు అయింది. "వ్యవసాయం మీద ఆధారపడే వారి సంఖ్య ఏడాదికి 0.6శాతం పెరిగింది. ఇందులో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 1.2శాతం ఉంది. వ్యవసాయ కూలీలు గుంటూరు జిల్లాలో అత్యధికం కాగా, చిత్తూరు జిల్లాలో తక్కువ. వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్య వెయ్యి హెక్టార్లకు 2001లో 2138 మంది కాగా, 2012నాటికి 2172కు పెరిగింది. ఇది కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో 3వేలకు పైగా ఉంది. తక్కువగా అనంతపురం జిల్లాలో 1172మంది ఉన్నారు.

కూలీలను వినియోగించే రోజుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2002లో 104రోజులు ఉంటే, 2010 నాటికి 97రోజులకు తగ్గింది. చెరకుకు 298రోజులు, పత్తికి 129, వరికి 104, మొక్కజన్న, కందికి 70, వేరుసెనగకు 60 రోజులు

కూలీలు అవసరమవుతారు. చిన్న కమతాల్లో వ్యవసాయ కూలీల వినియోగం ఎక్కువగా 128.7 రోజులు ఉండగా.. మధ్య, పెద్ద కమతాల్లో 75.4 రోజులు ఉంది. 2002లో హెక్టారుకు 11.5 గంటలు యంత్రాలను వినియోగిస్తే, 2012నాటికి 14.2 గంటలకు పెరిగింది" అని కమిటీ తెలిపింది.

### దేశంలోనే అధికంగా ఎరువుల వినియోగం

"రాష్ట్రంలో ఎన్.పి.కె ఎరువు వినియోగం క్రమంగా పెరిగింది. 1972లో హెక్టారుకు 30 కేజీలు వినియోగిస్తే 2002 నాటికి 189 కేజీలకు, 2012 నాటికి 282 కేజీలకు పెరిగింది. ఇంత వినియోగం పెరగడం దేశంలోనే అధికం.

వినియోగం ఉత్తరాంధ్రలో 128-178 కేజీలు కాగా, రాయలసీమలో 103-241 కేజీలు, కోస్తాంధ్రలో 320-604 కేజీలు ఉంది. అత్యధికంగా పశ్చిమగోదావరి జిల్లాలో 604కేజీలు కాగా, అనంతపురంలో అతి తక్కువగా 103కేజీల వినియోగం జరిగింది.

1972లో వెయ్యి హెక్టార్లకు 8 పంపుసెట్లు ఉండగా, 2012నాటికి 109కి పెరిగింది. సాగు ప్రాంతంలో రోడ్డు వసతి వెయ్యి హెక్టార్లకు 1972లో 23 కిలోమీటర్లు ఉంటే, 2010 నాటికి 33 కిలోమీటర్లకు పెరిగింది.

ప్రైమరీ, సెకండరీ మార్కెట్లు పది లక్షల హెక్టార్లకు 1972లో 42 ఉంటే, 2010నాటికి 104కు పెరిగాయి. 1966లో పదివేల హెక్టార్లకు మూడు ట్రాక్టర్లు ఉంటే, 2007 నాటికి 109కి పెరిగింది. అత్యధికంగా కడప, నెల్లూరు జిల్లాల్లో 200, 203 ఉండగా.. విశాఖపట్నం జిల్లాలో అతి తక్కువగా 8 చొప్పున ఉన్నాయి" అని కమిటీ తెలిపింది.

### పంటల సరళిలో మార్పులు

రాష్ట్రంలో పంటల సరళిలో గణనీయమైన మార్పులు సంభవించాయి. పండ్ల తోటల విస్తీర్ణం 1965లో 5.5శాతం ఉంటే, 2003 ఆఖరు నాటికి 12.1శాతానికి, 2013నాటికి 14శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది. అదే ఆహారధాన్యాల సాగు విస్తీర్ణం 71.6శాతం నుంచి 54శాతానికి తగ్గింది.

రైతులు తమ వాటా భూమిని ఎక్కువగా కోల్పోయారు. ప్రత్యేకించి సరళీకరణ విధానాల అమలు తర్వాత ఇది ఎక్కువగా జరిగింది. వాణిజ్య పంటల విస్తీర్ణం పెరిగింది.

## కమిటీ సిఫార్సులివీ

- ఆంధ్రప్రదేశ్ రైతు కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఆర్థిక శాస్త్రవేత్త నేతృత్వంలో దీన్ని ఏర్పాటు చేసి వ్యవసాయ ఆర్థికవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ వర్సిటీ వీసీలకు చోటు కల్పించాలి. వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి సలహాదారులను ఏర్పాటు చేయాలి. ఈ మండలి సిఫార్సులను అమలు చేయాలి. పంజాబ్ రైతు కమిషన్ తరహాలో ఏపీ కమిషన్ పనిచేయాలి.
- రైతులు తమ సమస్యల గురించి చర్చించుకుని పరిష్కరించుకునేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ సుస్థిర వ్యవసాయ రైతు సాధికార సంస్థ (ఏపీఎస్ఏఎఫ్ఈ)ని ఏర్పాటు చేయాలి. ఈ సంస్థ రైతులు స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యలను ఏర్పరచుకోవడానికి అవసరమైన మార్గదర్శనం చేయాలి. సంస్థకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించాలి. సన్న, చిన్నకారు, గిరిజన రైతులు, మహిళా రైతుల్లో అవగాహన పెంచాలి.
- రైతులను వ్యవసాయాధారిత పరిశ్రమల్లో, ప్రాసెసింగ్‌లోనూ భాగస్వాముల్ని చేయాలి. సన్నకారు రైతులు సమస్యలను అధిగమించేందుకు ఏపీఎస్ఏఎఫ్ఈ సహకారం అందించాలి.
- సహకార సంఘాలు, ఉత్పత్తి కంపెనీలు, స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైనచోట ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలి.
- రైతులు సాంకేతిక సాయం కోసం వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడకుండా చూడడానికి చర్యలు తీసుకోవాలి.
- ప్రస్తుతం ఉన్న సాంకేతిక విస్తరణ సంస్థలు చాలా బలహీనంగా వున్నాయి. మెరుగైన వ్యవసాయ పద్ధతుల్ని రైతుల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించాలి.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ సంస్థలకు కోట్ల


రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. ఈ సంస్థల వల్ల ప్రయోజనాలు తక్కువగా వున్నాయి. చిన్న రైతుల అవసరాలకు తగ్గట్టుగా ఈ సంస్థలు పనిచేసేలా చూడాలి. సంస్థల బోర్డుల్లోకి రైతు ప్రతినిధులను, సన్నకారు రైతులు, మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులను ప్రజాస్వామికంగా ఎన్నుకోవాలి. సంస్థల మధ్య పోటీతత్వాన్ని పెంచేలా ప్రోత్సాహకాల్ని ఇవ్వాలి.

- వ్యవసాయ మార్కెటింగ్‌లో సంస్కరణల్ని తేవాలి. మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలను వినియోగించుకోదలచుకున్న వ్యాపారస్తులు, కమీషన్ ఏజంట్లను వ్యవసాయ మార్కెట్ కమిటీలో భాగస్వాముల్ని చేసి ఫీజు వసూలు చేయాలి.
- స్వయం సహాయక సంఘాలతో ప్రయివేటు మార్కెట్ కమిటీలను ప్రోత్సహించాలి. రైతులకు బాధ్యులుగా లేనివారిని మార్కెట్ కమిటీలకు నామినేట్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పురావాలి. రైతులే తమ ప్రతినిధులను ఎన్నుకోవాలి. మార్కెట్ కమిటీల వద్ద మిగులు నిధులు వున్నా రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి వినియోగించుకునే స్వేచ్ఛ లేదు. ఎక్కువ నిధులను మార్కెట్‌లో మౌలిక వసతులకు వినియోగించాలి.
- మార్కెట్లలో పంట ధరల వివరాలను ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే ద్వారా తెలపాలి. తూకాల్లో మోసాలను నివారించాలి. కార్యకలాపాలన్నిటిని డిజిటలైజ్ చేయాలి.
- రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు గ్రేడింగ్ ల్యాబరేటరీలే వున్నాయి. వీటి సంఖ్యను పెంచాలి.
- రైతు బజార్ల పనితీరు మెరుగ్గా వుంది. కొన్నిచోట్ల వ్యాపారస్తులు ఆక్రమించుకున్నారు. తూకాల్లో అక్రమాలను కూడా అరికట్టాల్సి వుంది.
- చిన్న రైతులు గ్రూపులు, సమాఖ్యలుగా ఏర్పడి సమష్టిగా మార్కెట్‌లో రోజువారీ కార్యకలాపాల్లో పాలుపంచుకునేలా చూడాలి. దీనివల్ల కమీషన్ ఏజంట్ల ప్రభావాన్ని తగ్గించవచ్చు.
- ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలి. నాబార్డు, సహకార బ్యాంకు అధికారులతోపాటు రైతులతో గ్రూపులు ఏర్పాటు చేయాలి.
- వాణిజ్య బ్యాంకులు రైతులకు పెట్టుబడి వ్యయం సమకూర్చడంతోపాటు వ్యవసాయరంగంలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి రుణాలివ్వాలి.
- రైతు ఉత్పాదక సంస్థలను ఏర్పాటు చేయడానికి గట్టి ప్రయత్నం చేయాలి. కేరళలో 'మార్జినల్ ఫార్మర్స్' పేరుతో ఏర్పడిన మార్కెట్ నమూనా పద్ధతిని అమలు చేయాలి.
- వడ్డీ వ్యాపారులకు ఒకేసారి మొత్తం అప్పు చెల్లించడానికి వీలుగా బ్యాంకు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలి.
- బ్యాంకులు కౌలుధరలను స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో భాగం చేయాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే 30శాతం అదనంగా రైతుకు రుణాలివ్వాలి.
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రుణాలను రీ షెడ్యూల్ చేసినప్పుడు వడ్డీ రద్దు పథకాన్ని అమలుచేయాలి.
- వడ్డీ రద్దు, విత్తన రాయితీలు, బీమా చెల్లింపు ఇలా అన్నింటికీ నగదు బదిలీని అమలు చేయాలి.
- పంటల బీమా పథకం అమలు లోపభూయిష్టంగా వుంది.
- కౌలు రైతు చట్టంలో మార్పు తేవాలి. కౌలు రైతుకు పెట్టుబడి వ్యయం, రుణం అందే అవకాశం లభించాలి. పరిశ్రమలకు భూమి ఇచ్చేందుకు భూబ్యాంకులు ఏర్పాటు చేసినట్టుగానే పెద్ద రైతులు, వ్యవసాయం చేయని రైతుల నుంచి భూబ్యాంక్‌ను లీజుకు తీసుకుని రైతులకు దీర్ఘకాలంగా లీజుకిచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ, పంచాయతీ అధికారులు, ఏపీ ఎస్ఏఎఫ్ఈ ధృవీకరించిన కౌలు సమాఖ్యల మధ్య కౌలు ఒప్పందాలు జరగాలి.
- మార్కెట్ స్థిరీకరణ పథకం రాష్ట్రంలో అప్పుడప్పుడు అమలువుతోంది. అన్ని పంటలకూ అమలు కావడం లేదు. మార్కెట్ ఫీజు కింద వసూలు చేసే మొత్తంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను దీనికి వినియోగించాలి.

# రైతుకు కొలబత్తెం

-ఎ. ఉమామహేశ్వరరావు

ఒక ఉద్యోగి జీతంలో బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ, స్పెషల్ అలవెన్సులు ఉన్నట్టుగానే అన్నదాత పంటసాగుకు అవసరమయ్యే మొత్తంతోపాటు ఆ ఏడాది అతని కుటుంబ ఖర్చులు కూడా పెట్టుబడి మొత్తంగానే పరిగణించాలి. రైతు పిల్లలకు అవసరమయ్యే పాఠశాల ఫీజులు, ఆసుపత్రి ఖర్చులు, ఇతరత్రా కూడా ఇందులోనే రావాలి. పంట చేలో కాయకష్టంతో దేశానికి అన్నం పెట్టే రైతును తన కుటుంబ ఖర్చుల కోసం కాబూలీ దగ్గర వడ్డీలకు వెళ్లమనడం ఏ విధంగానూ న్యాయం కాదు. అయితే గత ఎన్నికలకు ముందు వరకూ రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో పెద్ద నిబంధనలు ఉండేవి కావు. దీంతో రైతులు పంట పెట్టుబడితోపాటు ఇతర ఖర్చులకు పెంచుతూ ఉంటుంది. ఇది ఒక్కో పంటకు ఒక్కో విధంగా ఉంటుంది. వరి, కంది, మినుము వంటి సంప్రదాయ పంటలకు ఎకరాకు సుమారుగా 15 నుంచి 20వేల రూపాయల వరకూ ఉంటే.. పత్తి, పొగాకు, పసుపు వంటి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.35 నుంచి 50వేల వరకూ ఉంటుంది. రైతుకు ఎంత మొత్తం పొలం ఉంది? అందులో ఏమి సాగుచేయబోతున్నారో బ్యాంకుకు తెలియజేస్తే దానిని పరిగణలోకి తీసుకుని 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' ప్రకారం ప్రస్తుతం రైతులకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ఆ మొత్తానికి నామమాత్రంగా కొద్దిమొత్తంలో మాత్రమే బంగారంపై రుణం ఇస్తున్నారు. ఈ విషయం తెలియక గతంలో మాదిరిగా




అవసరమైన డబ్బు పంట రుణంతోపాటు నాలుగు శాతం వడ్డీకి తమ తాహతు మేరకు వారి వద్ద ఉన్న బంగారంపై రుణాలు పొందేవారు. అయితే పంట రుణాల మాఫీ మొత్తం తగ్గించడం కోసం రెండు తెలుగు రాష్ట్రాలలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాలు తెరపైకి తెచ్చిన 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' రైతుల కొంప ముంచుతోంది. ప్రభుత్వం అందించిన ఈ ఆయుధాన్ని బ్యాంకులు రైతులపై ప్రయోగిస్తుండటంతో వారు దిక్కుతోచని స్థితిలో కుటుంబ ఖర్చుల కోసం ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. పంట రుణం పరిమితం కావడంతో ఇతర ఖర్చులకు అధిక వడ్డీలకు రుణం తీసుకోవాల్సి వస్తోంది.

ప్రతి పంటకు సాగు చేయడానికి ఎకరానికి ఇంత మొత్తం అవసరమని ఏటా కేంద్రం నిర్ణయిస్తుంది. మార్కెట్లో పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ఏటా దీనిని తగిన మొత్తంలో బంగారంపై ఎక్కువ మొత్తంలో అప్పులు తీసుకున్న రైతులకు సబ్సిడీ రుణం రాకపోవడంతో అధిక వడ్డీలు చెల్లించలేక లబోదిబోమంటున్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్లో విత్తనాలు నాటే దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు అయ్యే ఖర్చు ప్రతి రూపాయి లెక్కిస్తారు. అయితే అధికారులు ఎంత కచ్చితంగా లెక్కించినా మార్కెట్ రేట్లలో రోజురోజుకూ పెరిగే ధరలను పోల్చుకుంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద నిర్ణయించే మొత్తం పెట్టుబడికి సరిపోదు. పైగా ఇందులో పంటకు అవసరమైన ఖర్చులు మాత్రమే లెక్కిస్తారు. పొలంలో రైతు చేసే కష్టాన్ని లెక్కలోకి తీసుకోరు. ఒక్కో పంట దాని కాలపరిమితిని బట్టి 90 రోజుల నుంచి 120 రోజుల వరకు, కొన్ని పంటలు ఆరు నెలలపాటు ఉంటాయి. ఈ కాలంలో రైతు రోజూ పొలంలో పనిచేయాలి. ఒక పంట కోసం

రైతు సుమారు 120 రోజులు తన పొలంలో పనిచేయాలంటే ఈ కాలంలో రోజుకు రూ.300 చొప్పున కూలీ లెక్కించినా 36వేల రూపాయలవుతుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో నిర్ణయించిన మొత్తానికి కూలీ కలుపుకుంటే ఏ రైతుకు పంట ధర గిట్టుబాటు కాదు. వాస్తవానికి గిట్టుబాటు ధర లెక్కించే విషయంలో రైతు తన శ్రమకు లెక్కకట్టుకోడు. అదే ఒక వ్యాపారి అయితే నిక్కచ్చిగా తన శ్రమకు మంచి ఖరీదే కట్టుకుంటాడు. అదే రైతు తన శ్రమకు ఖరీదు కట్టి మార్కెట్ ధరను నిర్ణయించే పరిస్థితే ఉంటే దేశంలో చాలామందికి ఆహారధాన్యాల ధరలు అందుబాటులో ఉండవన్నది కాదనలేని సత్యం. రైతుకు పంట పండించడమే కాదు, అమ్ముకోవడమూ శ్రమతో కూడుకున్నదే. ఫ్యాక్టరీలో తయారైన వస్తువులను మనం దుకాణానికి వెళ్లి కొనుక్కుంటాం. అదే రైతు తన పంటను మార్కెట్ యార్డులకు తరలించి అక్కడ నిద్రాహారాలు మాని జాగారాలు చేసి పంట అమ్ముకోవాల్సి ఉంటుంది. మిర్చి యార్డులు, పత్తి యార్డుల్లో రైతుల కష్టాలు వర్ణించనలవి కాదు. అదే పొగాకు రైతులకైతే మూడు నెలల్లో పంట చేతికొస్తే అమ్మేందుకు ఆరు నెలల సమయంకూడా పడుతుంది. ఈ ఆరు నెలలు అతను పంటను గ్రేడింగ్ చేయటం, తిరగవేయటం, రంగుమారి నాణ్యత తగ్గకుండా ఏర్పాట్లకు నానాచాకిరీ చేయటం ఉంటుంది.

భారతదేశంలో రైతు ఇంట్లో ఆ రైతు తాహతుకు మించి బంగారం ఉంటుంది. సహజంగా రైతులు ఏడాది ఆరంభంలో పంట రుణాలతోపాటు పిల్లల చదువులు, పశువుల కొనుగోళ్లు, ఆస్పత్రి ఖర్చులు ఇలా వారి తాత్కాలిక అవసరాలకు లెక్కగట్టి విడతలవారీగా బంగారాన్ని బ్యాంకులో పెట్టి నాలుగుశాతం వడ్డీకి రుణాలు పొందే అవకాశం ఉండేది. ఒక్కోసారి వారు పంట రుణం ఒక బ్యాంకులో తీసుకుంటే అక్కడ వారికి ఉన్న పొలానికి సరిపోను బంగారం రుణం పరిమితి దాటితే మరో బ్యాంకులో అదే పొలం పాసు పుస్తకం జిరాక్స్ కాపీ ఇచ్చి మరలా నాలుగు శాతం వడ్డీకి రుణం తీసుకునే సౌలభ్యం ఉండేది. బ్యాంకులు కూడా అప్పటి ప్రభుత్వ నిబంధనలు, పంట రుణాల టార్గెట్ల పూర్తి కోసం రైతులకు బంగారంపై బాగానే రుణం ఇచ్చేవారు. బంగారం తమ వద్ద ఉంటుంది కాబట్టి బ్యాంకులకూ రికవరీ విషయంలో ఎటువంటి సమస్యా ఉండదు. ఏడాదిలోగా దానిని చెల్లించి మరలా వెంటనే రుణం తీసుకునే వెసులుబాటు ఉండేది. అదే సహకార పరపతి సంఘాల్లో అయితే వడ్డీ మాత్రమే చెల్లించి రీ షెడ్యూల్ చేసుకొనే అవకాశం కూడా ఉండేది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అమల్లోకి వచ్చాక రైతులు ఆ సౌకర్యం కోల్పోయారు. దాంతో ఇతరుల మాదిరిగానే రైతులు కూడా బ్యాంకులలో 14శాతం వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. చాలామంది రైతులకు వడ్డీ లెక్కలు తెలియక తాము నాలుగు శాతం వడ్డీయే చెల్లిస్తున్నామనే భ్రమల్లో ఉన్నారు. కొద్దిగా వడ్డీ లెక్కకట్టగలిగే రైతులు బ్యాంకర్లను ఇంత వడ్డీ అయిందని అడిగితే, బ్యాంకు వారు చెప్పిన సమాధానం విని తెల్లమొహం వేయాల్సి వస్తోంది. ఎవరు అవునన్నా.. కాదన్నా ఈ పాపం మొత్తం రైతు రుణమాఫీ కోసం ఏర్పాటు చేసిన రైతు సాధికార సంస్థదే. దాని కర్త, కర్మ, క్రియ అయిన ఆ సంస్థ ఛైర్మన్ కుటుంబరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులదే. గతంలోనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలుమార్లు రైతులకు రుణమాఫీ జరిగాయి. అయితే ఆ మొత్తాన్ని కేంద్రం భరించేది. దాంతో రాష్ట్రాలపై ఆర్థికభారం లేకపోవడంతో రైతులు తీసుకున్న పంట రుణాలు, ఏకమొత్తంలో మాఫీ అయ్యేవి. ఈసారి కేంద్రం సహకారం లేకపోవడంతో ఆర్థికభారమంతా రాష్ట్ర ప్రభుత్వాలపైనే పడింది. దాంతో ఆ భారం సాధ్యమైనంత మేర తగ్గించుకునేందుకు ఆర్థిక మేధావులు మేధోమథనం నుంచి పుట్టుకొచ్చినదే ఈ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్.

ఆంధ్రాలో ఒక్కో రైతు కుటుంబానికి గరిష్టంగా లక్షన్నర, తెలంగాణలో లక్ష రూపాయల రుణమాఫీ జరిగింది. ఈ మొత్తాన్ని ఐదేళ్లలో ఏడాదికి 20శాతం చొప్పున రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో వేస్తున్నాయి. అంటే ఒక్కో రైతు కుటుంబానికి గరిష్టంగా ఏపీలో 30వేలు, తెలంగాణలో 20వేలు ఐదేళ్లపాటు చెల్లిస్తారు. అయితే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఐదెకరాల లోపు ఉన్న చిన్న రైతులకు సైతం దాదాపు లక్షరూపాయలకు పైగా బంగారంపై ఇచ్చే రుణ మొత్తం తగ్గిపోతుంది. 'గంప లాభం చిల్లి తీర్చిందన్న' చందంగా రైతులకు రుణమాఫీలో ఈ ఐదేళ్లలో వచ్చేదానికన్నా వారు వడ్డీ రూపంలో కడుతున్నదే ఎక్కువ. ఒకవిధంగా చెప్పుకోవాలంటే పంట రుణాల్లో ప్రభుత్వాలు భరించే సబ్సిడీయే రుణమాఫీ రూపంలో రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రభుత్వాలు ఈ ఐదేళ్లు రైతులకు ఇచ్చి మాయ చేస్తున్నాయనడంలో సందేహం లేదు. (విమర్శల నేపథ్యంలో.. రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని ఇటీవల నాబార్డ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ మంత్రులు కోరారు. పాలకుల తప్పిదాలకు రైతులు నష్టపోకుండా బ్యాంకులు ఏమేరకు బాధ్యత తీసుకుంటాయో వేచిచూడాలి)

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# ఆత్మహత్యలు - ఆత్మహత్యా ప్రయత్నాలు - ఆమరణ నిరాహార దీక్షలు - రాజకీయాలు

- మునుకుట్ల పార్ధసారథి,
లోక్‌సత్తా శాశ్వత సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం



ఈ మధ్య మన సైన్యం అవాంఛనీయ కారణాలకు వార్తల్లోకి వస్తోందంటే కాస్త విజ్ఞత గల వారెవరూ విభేదించకపోవచ్చు. మిగిలిన ఉదంతాల్ని అలా ఉంచితే.. రాంకిషన్ గ్రేవాల్ అనబడే 70 సంవత్సరాల మాజీ సైనికోద్యోగి తనకు రావలసిన పెన్షను విషయంలో నిరాశ చెంది ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం చాలామందికి గుర్తుండి ఉంటుంది. ఒకే ర్యాంకున్న సైనికులకు ఒకే పెన్షన్ అనే ప్రభుత్వ సంస్కరణ పథకం రూపకల్పన, అమలులో లోపాలు కావచ్చు, లేదా మరేదైనా కారణం కూడా కావచ్చు– కానీ దానికి ఆత్మహత్య చేసుకుని ఆ మాజీ సైనికుడు ఏమీ సాధించలేకపోయాడన్న విషయాన్ని యావత్ సభ్యసమాజం అంగీకరించవలసి ఉంటుందని నా అభిప్రాయం. తగుదునమ్మా అని అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ మృతుని కుటుంబాన్ని పరామర్శించటానికి వెళ్లి అంత హంగామా చేయటం అవసరమా అన్నది కూడా చర్చనీయాంశమైంది. విజ్ఞులైన పాఠకులూ, మేధావులూ, మీడియా సంపాదకులూ, దేశంలోని అన్ని వర్గాల పౌరులూ పార్టీలకతీతంగా కూలంకషంగా చర్చించాల్సిన అత్యంత సున్నితమైన సమస్య ఇది. ప్రఖ్యాత హాలీవుడ్ నటి మెరిలిన్ మన్రో అయినా, నియంత హిట్లర్ అయినా ఆత్మహత్య చేసుకున్నవారంతా ఏదోకస్థాయి మానసిక రోగులే. అందరికీ ఆరోగ్యాన్ని, అవకాశాల్ని అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వం సక్రమంగా నెరవేర్చేలా చేయగలిగితే.. పేదరికం, అవిద్యతో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారిని మానసిక రోగులు అనటం అమానుషమన్న సంశయం నుంచి కూడా బైటపడగలం.

## According to a report in The Times of India dt.10-12-2014:

The government has decided to decriminalize "attempt to suicide" by deleting section 309 of the Indian Penal Code from the statute book. Under the said section, a suicide bid is punishable with imprisonment up to one year, or with fine, or both. Stating this in reply to a question in Rajya Sabha on wednesday, minister of state for Home Haribhai Parathibhai Chaudhary said the government had decided to drop Section 309 from the IPC after 18 states and 4 union territories backed the recommendation by of the Law Commission of India in this regard. Government sources told TOI that a cabinet note on the Indian Penal Code (Amendment) Bill has already been circulated by the Union home ministry among other minstries such as Law and health.

The Indian Express in its news article dt.22-12-2014 stated that persons driven to commit suicide are, more often than not, facing mental health disorders and are in need of care and treatment was suggested in the new Mental Health Care Bill, 2013. This MHC bill 2013 provides that any person attempting to commit suicide should be assumed to be suffering from a mental illness, and that it would be the duty of the government to provide him or her with adequate care.

The disability rights movement has been arguing for an understanding that is not rooted in a medical or a "disease"-based model but in a social model that conceptualises disability as the advantages and exculsions faced by people because of social barriers and attitudes. Mental health, if seen through a medical model, is completely surrounded by misunderstandings and negative stereotypes that result in stigma and discrimination against as well as isolation of people with mental illness and their fami-

lies and carers. This social model of disability urges us to look beyond the issues of medical treatment and disease, to the identification of the social barriers that deny people with psycho-social disabilities (like) the rights to employment, education, recreation and even citizenship. This social model is the core of the UN Convention on Rights of Persons with Disabilities, which has been signed and ratified by India.

ఇకపోతే, అక్టోబర్ 17, 2008లో ఇండియన్ లా కమిషన్ తమ 210వ రిపోర్టులో మానవీయ కోణం ప్రాతిపదికన చేసిన సూచనల మేరకు.. ఆత్మహత్యకు పాల్పడినవారిని శిక్షించే చట్టాన్ని (సెక్షన్ 309 భారతీయ శిక్షాస్మృతి) రాజ్యాంగ సవరణ ద్వారా ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం 2014లో తొలగించి సదుద్దేశాన్ని ప్రకటించింది. దీనికి 18 రాష్ట్రాలూ, 4 కేంద్ర పాలిత ప్రాంతాలూ మద్దతు తెలిపాయి. అంతకుముందు వరకు ఆత్మహత్యకు ప్రయత్నించినవారిని శిక్షార్హులుగా ప్రభుత్వం పరిగణించవలసి వచ్చేది. సందర్భమేదైనా, కారణాలేమైనా రాజకీయ నాయకులు చేసే ఆమరణ దీక్షకూ, సామాన్య పౌరులు మానసిక దౌర్బల్యంతో చేసుకునే ఆత్మహత్యా ప్రయత్నానికీ చట్టపరంగా తేడా ఉండేది కాదు. ఇక్కడ స్పష్టంగా కనిపించే ఒక వ్యత్యాసాన్ని చాలా జాగ్రత్తగా మనం అర్థం చేసుకోవాలి. "ఆమరణ నిరాహార దీక్ష"కు దిగిన వ్యక్తికి సాంఘికపరమైన మానసిక ఒత్తిడి భరించలేకపోవడం ద్వారా వైకల్యం (social model disability.) సంక్రమించినట్టుగానూ, "ఆత్మహత్యా ప్రయత్నం" చేస్తూ ఉండగా పట్టుబడిన వ్యక్తికి వైద్యపరమైన మానసిక ఒత్తిడి భరించలేకపోవడం ద్వారా వైకల్యం (medical model disability) సంక్రమించినట్టుగానూ గుర్తించి సమస్య పరిష్కరించాలి. అందుచేత ఎవరైనా "ఆమరణ దీక్ష" చేస్తానంటే చాలు, ప్రభుత్వానికి ఊపిరాడేది కాదు. ఎందుకంటే, పౌరుణ్ణి శిక్షించే ముందు అతని ఆరోగ్యాన్ని రక్షించే బాధ్యత ప్రభుత్వం నెత్తిన పడేది. ఈ చట్ట సవరణ జరగక మునుపు మన రాజకీయ నాయకులు "ఆమరణ నిరాహార దీక్ష" పేరిట పబ్లిగ్గా తిండి తినటం మానేసి సామాన్య పౌరులనీ, ఎన్నికైన ప్రభుత్వాలనీ భయభ్రాంతుల్ని చేసి తమ స్వార్థ రాజకీయాలలో ఎంతో లబ్ధి పొంది ఎన్నో "విజయాలు" సాధించారన్న మాట మాత్రం వాస్తవం. కొన్ని కొన్ని సందర్భాలలో ప్రభుత్వ ఆస్తుల్ని అల్లరి మూకల చేత తగలబెట్టిస్తారు కూడా!

ఇక మీదట ఎవరైనా రాజకీయ నాయకుడు/నాయకురాలు స్వార్థ రాజకీయ లబ్ధికి ప్రజలు కోరుకుంటున్నారన్న సాకుతో, తన వ్యక్తిగత జీవితాశయాలను నెరవేర్చుకునే క్రమంలో "ఆమరణ నిరాహార దీక్ష" ప్రకటిస్తే, దానికి ప్రభుత్వాలు భయపడిపోయి, పోలీసు రక్షణ కల్పించి, అంబులెన్స్ని రెడీగా ఉంచి, రోజుకు రెండు మార్లు ప్రభుత్వ డాక్టర్ల చేత వైద్యపరీక్షలు చేయించి, ఏవో కొన్ని హామీలిచ్చి, ఆఖరికి కాళ్లకు కూడా దండం పెట్టి నిమ్మకాయ నీళ్లు తాగించాల్సిన అవసరం లేదు. దీక్షలో ఉన్న వారి అనుచరగణం మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించటం కోసం రాస్తారోకోలు, బంద్‌లు విచ్చలవిడిగా చేస్తూ ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తూంటే ప్రభుత్వం నిస్సహాయంగా ఉండాల్సిన అవసరం లేదు. సంబంధిత సంఘవిద్రోహ కార్యకలాపంగా కేసు బుక్ చేసి జైలులోకి పంపిస్తే చాలు.

నిస్వార్థంగా దేశ ప్రయోజనాల కోసం కూడా ఆమరణ దీక్షలను చేపట్టే వారు కూడా కొందరు ఉండొచ్చు. బ్రిటిష్ వారి కాలంలో గాంధీ చేశారుగదా అనే భక్తితో వారు స్వతంత్ర రాజ్యాంగ ప్రజాస్వామ్య భారత్‌లో కూడా అదే పద్ధతిని ఆశ్రయించవచ్చు. అలాంటివారు రాజ్యాంగబద్ధ ఆందోళనాపద్ధతులను అనుసరించేలా చైతన్యపరుస్తూనే ఉండాలి.


ఇకపోతే నిజంగా ఆత్మహత్య చేసేసుకునే మనిషిని ఎవరూ ఏమీ చేయలేరు. ఎందుకంటే, రహస్యంగా వారు సంకల్పించిన ప్రాణం తీసుకోవడమనే పనిని అత్యంత పకడ్బందీగా నిర్వహించుకుంటారు. ఆత్మబలిదానాలు వంటి బిరుదులు, పరిహారాలతో ఇలాంటివి ప్రోత్సహించకుండా.. సరైన విద్య, ఆరోగ్యంతో అందరికీ ఎదిగే అవకాశాలు, ఆదాయాల పెంపు ఉన్న వ్యవస్థను నిర్మించాలి. కుటుంబ వ్యవస్థలో, సమాజంలో విలువలను బలోపేతం చేయటాన్ని ప్రోత్సహించాలి. ఇలా వ్యవస్థీకృత ఏర్పాట్ల వల్ల చాలామేర రైతుల్లో, బాధిత వర్గాల్లో ఆత్మహత్యలను నిరోధించవచ్చు. అయినా వ్యక్తిగత స్థాయిలో బలహీనులు ఉంటారు. వారికి అండగా కొన్ని అదనపు ఏర్పాట్లను నిరంతరం కొనసాగిస్తుండాలి. ''మంచిని ప్రోత్సహించటం, చెడును నిరుత్సాహపరచటం" అనే బాధ్యతను ప్రభుత్వం, సమాజం సక్రమంగా నెరవేరిస్తే ఆత్మహత్యల సంక్షోభం నుంచి మనదేశం తేలిగ్గా బైటపడుతుంది.

Taking Your own life. Interesting expression, taking it from who? Once it's over, it's not you who'll miss it. Your own death is something that happens to everyone else. Your life is not your own, keep your hands off it.

**-Sherlock (BBC, The Lying Detective)**

# నాయకి!

- ఎ. అన్నపూర్ణ



ఆమె చలనచిత్ర రంగంలో నటిగా దేశంలోని చాలామందికి పరిచితురాలు. సినిమా నటిగా ఎంతగా ప్రేక్షకాదరణ సంపాదించారో, రాజకీయాలలో ప్రవేశించి తమిళనాడు ముఖ్యమంత్రిగా కూడా అంతకు మించిన గుర్తింపును సొంతం చేసుకున్నారు. సినిమా నటులు ఆ తర్వాత ఎంతమంది రాజకీయాలలో ప్రవేశించినా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగినవారు లేరు. సినీ హీరోలు ముఖ్యమంత్రులయ్యే అవకాశాలు ఇక ముందు లేవనే అనుకోవచ్చు. కొందరు వ్యక్తులు ఎంచుకుని తమకు నచ్చిన రంగంలోకి ప్రవేశించి ఉన్నతస్థాయికి ఎదగటానికి ప్రయత్నాలు చేస్తారు. మరికొందరు అనుకోకుండా రాజకీయ ప్రవేశం చేస్తారు. రాజకీయాల్లోకి రావడానికి తల్లి, తండ్రి, భర్త సోదరీసోదరులు సోపానాలు అయితే, కొందరికి గాడ్‌ఫాదర్‌లు ఉంటారు. జయలలిత ఈ విధంగా ఎంజీ రామచంద్రన్ ఆసరాతో ఆయన తర్వాత వారసురాలిగా ఎదిగారు. 1987లో ఎంజీఆర్ మరణించిన తర్వాత ఎన్నో ఒడిదుడుకులు, అవమానాలను ఎదుర్కొని 1989లో తమిళనాడు శాసనసభలో మొదటిసారి విపక్ష నేతగా ఎంపికయ్యారు. జయలలిత రాజకీయ ప్రస్థానం 1981 నుంచి 2016లో మరణించేవరకు కొనసాగింది. 1981లో ఎంజీఆర్ జయను అన్నాద్రవిడ మున్నేట్ర కజగం పార్టీలోకి తీసుకురావడమే దేశ రాజకీయగతిని ప్రభావితం చేయగల ఒక విప్లవ వనితగా ఆమె తమిళ ప్రజల మనసుల్లో స్థిర స్థానం సంపాదించుకోవడానికి నాంది.

ఒక మహిళ ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పరిపాలన చేయటం మామూలు విషయం కాదు. ఇది జయలలిత సాధ్యం చేసి చూపారు. జీవనయానంలో ఒంటరి అయిన జయ తమిళనాడు ముఖ్యమంత్రి కావటానికి చాలా పోరాటమే చేశారు. అది మహిళలకు సహజమైన దేశంలో మనమున్నాం. రాజకీయాలలో అవమానాలు, తిరస్కారాలు, దూషణలు మహిళగా మరీ ఎక్కువగా ఎదుర్కోవలసి ఉంటుంది. వాటిని సవాలుగా తీసుకుని తనకంటూ ఎందరో అభిమానులను కార్యకర్తలను సంపాదించుకున్నారు. పేద ప్రజలు 'అమ్మ'గా పిలుచుకునే ఆరాధ్యురాలయ్యారు. ఎంజీఆర్ దగ్గర ఎలాంటి శిక్షణ పొందారో తెలియదుగానీ ప్రజల నాడిని పట్టుకోవడంలో ఆమె తెలివితేటలు అమోఘం. సినీతారలందరికీ రాజకీయాలు తెలియవు. గౌరవసూచకంగానో మరోరకంగానో రాజ్యసభ సభ్యులుగా అవకాశాలు రావచ్చునేమోగానీ అలాంటివారు అలంకారానికి మాత్రమే!

ఒక సినీనటి రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు అవహేళనలు అవమానాలు ఎదుర్కోవలసి వస్తే వెంటనే తప్పుకోవటం లేదా కుంగిపోవటం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ అలా చేసి ఉంటే జయ విప్లవ నాయకి ఎలా అవుతారు? నడచివచ్చిన ముళ్లబాటను గుణపాఠాలుగా మలచుకుని ప్రత్యర్థులకు తగిన గుణపాఠం చెప్పగలిగిన ధీరవనిత జయలలిత. ఆమె కోరుకున్న లక్ష్యం కంటే పోరాటమే ఆమె విజయానికి సోపానంగా మారింది. వ్యవస్థీకృత మార్పుల కోసం దీర్ఘకాలం కృషి చేయాల్సిన సంస్కర్తలను మినహాయించి జయలాగా వ్యక్తిగతంగా విజయాలు సాధించే లక్ష్యంతో వచ్చేవారినే తీసుకుంటే.. కొందరు ఏరికోరి రాజకీయాలను ఎంచుకుంటారు. అంతమాత్రాన ఆ రంగంలో రాణించలేరు. నిలదొక్కుకుని ఉన్నతస్థానానికి ఎదగడం అంత సులువు కాదు. అంచలంచెలుగా ఎదుగుతూ వ్యతిరేక శక్తులను అడ్డుకుంటూ ముఖ్యమంత్రి స్థాయికి చేరువకావడం అద్భుతమనే చెప్పాలి. సాంప్రదాయ రాజకీయాలంటేనే ఎత్తులు పైఎత్తులు, కుట్రలూ కుతంత్రాలు, అడుగడుగునా అవాంతరాలు ఉంటాయి. అయినవారే నమ్మకద్రోహం చేస్తారు. వెన్నుపోటుకు వెరవరు. అలాంటిది కుటుంబం, ఆప్తులు, బంధువర్గం అంటూ ఎవరూ తోడు లేరు. తల్లి చనిపోయాక ఒంటరిగానే ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఎవరో ఒకరిని ఆశ్రయించాల్సిందే. అది అవసరం. మనిషి ఒంటరిగా అన్ని సమస్యలనూ ఎదుర్కోవడం కష్టం. అప్పుడు తోడుగా నిలిచింది పార్టీలోని సభ్యులు, కార్యకర్తలే. వేరే రాష్ట్రంలో పుట్టి తమిళనాడులో రాజకీయాలలో ప్రవేశించి, ప్రజల ఆదరాభిమానాలు సంపాదించుకున్నారంటే ఆమె ఎంచుకున్న పథకాలు, అమలు తీరు ప్రధాన కారణం. ప్రజలను ఆదుకోవడానికి, ముఖ్యంగా మహిళా అభిమానులను సంపాదించుకోవడానికి ప్రవేశపెట్టిన పథకాలు ఆమెను 'అమ్మ' స్థానంలో కూర్చోబెట్టాయి. అందులో 'ఆడపిల్లల దత్తత పథకం' ఒకటి.

వ్యక్తిగతంగా ఒంటరి కాకుండా వివాహం చేసుకుని కుటుంబం అంటూ ఉంటే ఆమె జీవితం వేరుగా ఉండేదేమో.

# మళ్లీ అనాగరిక రాజకీయాలు

ఉప్పు-నిప్పు రాజకీయాల తమిళనాడులో ఇటీవల కొన్ని సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నా.. జయలలిత మరణానంతరం అధికార క్రీడ తిరిగి మొదలవటంతో ప్రతీకార రాజకీయాలు మళ్లీ మామూలవుతున్నాయి. మహిళగా తనకు జరిగిన అవమానాలకు జయ ప్రతీకారం తీర్చుకుంటూ నియంతలా పార్టీని, పాలనను శాసించటం, డీఎంకే కూడా అదే బాటలో నడవటం, ఆ రెండు పార్టీల వ్యవస్థను బ్రేక్ చేసే బలం ఇతర సాంప్రదాయ పార్టీలకో, కొత్త రాజకీయానికో లేకపోవటంతో తమిళ ప్రజలు ఆ రెండు పార్టీల మొరటు రాజకీయాల మధ్యే బతుకు బండి లాగిస్తున్నారు. అయితే 2015లో ఎన్నికల్లో గెలుపొందాక జయలలితలో కొంత మార్పు వచ్చింది. ప్రజాస్వామ్యమంటే విధానాల సంఘర్షణే తప్ప వ్యక్తుల ఘర్షణ కాదనే పరిణతిని ప్రదర్శించే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రిగా జయలలిత తాజా ప్రమాణస్వీకారోత్సవానికి విపక్ష నేత హోదాలో హాజరైన డీఎంకే నేత స్టాలిన్‌ని ఎక్కడో వెనకాల వరసలో కూర్చోబెట్టారట. దీంతో డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి సహా పలువురు పార్టీ వర్గాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. జయ యధావిధిగా అహంకారపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శించకుండా 'పొరపాటు జరిగింది' అని ఒప్పుకున్నారు. తన ప్రమాణస్వీకారోత్సవానికి హాజరైనందుకు స్టాలిన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కార్యక్రమానికి హాజరైనట్టు తన దృష్టికి రాలేదని, వచ్చినట్టయితే తప్పకుండా సీటు మార్పించి ఉండేదాన్నని తెలిపారు. అలాగే జయలలిత ఆసుపత్రిలో ఉన్నప్పుడు కరుణానిధి కుటుంబం పరామర్శించి కోలుకోవాలని ఆకాంక్షించింది. కానీ జయ మృతితో అన్నాడీఎంకేలో ఏర్పడిన నాయకత్వ గొడవలు ఆ పార్టీలోనివారికేకాకుండా డీఎంకే సహా పలు పార్టీల నేతలలో మళ్లీ అధికార క్రీడకు పురికొల్పుతున్నాయి. ప్రతిదీ రాజకీయం చేస్తూ, ప్రత్యర్థి నేతలపై దాడులకు దిగుతూ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. జల్లికట్టు, తమిళేతర నేతలు.. యువతలో భావోద్రేకాలను రేకెత్తించే ఇలాంటి అంశాలను అడ్డుపెట్టుకుని మొరటు రాజకీయాన్ని ఇంకా రాటుతేలేలా చేస్తున్నారు. సినీ గ్లామర్, ఇతరత్రా మార్గాల్లో అవకాశాలున్న రాజకీయేతరులు కూడా ఈ గందరగోళంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తహతహలాడుతున్నారు.

ఎంత స్నేహితురాలు అయినా శశికళ కూడా స్వార్థపూరితమైన ఆలోచనతోనే జయలలిత వెంట ఉన్నారన్న వాదనల్ని తోసిపుచ్చలేం.

అన్నాడీఎంకే పార్టీ స్థాపనను ఒకసారి చూస్తే.. తమిళనాడులో ద్రవిడ ఉద్యమానికి ఆద్యుడు 'పెరియార్' రామస్వామి. ఆయన స్థాపించినదే ద్రవిడ కజగం పార్టీ. పెరియార్ హయాంలో నియంతృత్వ ధోరణులు లేవు. ఆ పార్టీ నుంచి వచ్చినవారే అన్నాదురై, కరుణానిధి, తమిళ సూపర్‌స్టార్ ఎంజీ రామచంద్రన్. పెరియార్‌తో విభేదించిన అన్నాదురై.. కరుణానిధి, ఎంజీఆర్, నెడుంచెళియన్‌లతో కలిసి 'ద్రవిడ మున్నేట్ర కజగం' పార్టీ స్థాపించారు. పార్టీని పూర్తిగా వ్యక్తి ఆరాధనకు కేంద్రంగా మార్చివేశారు. ఆ తర్వాత విభేదించిన ఎంజీఆర్.. డీఎంకే నుంచి బైటికి వచ్చి అన్నాడీఎంకేను స్థాపించారు. తనకు దీటుగా ఎదుగుతారనుకున్నవారిని పక్కనపెట్టారు. ఆయన స్వయంగా రాజకీయాలలోకి తీసుకువచ్చిన జయలలితను సైతం విశ్వసించలేదు. ఎంజీఆర్ మరణానంతరం పార్టీ చీలిక జరిగే పరిస్థితుల్లో అప్పటి కాంగ్రెస్ నాయకుడు తిరునావుక్కరసు వంటి వారు జయలలితను ముందుకు తెచ్చారు.అలా తన రాజకీయ గురువు ఎంజీఆర్ ప్రమేయం లేకుండానే అన్నాడీఎంకే పార్టీకి అధినేత్రి అయ్యారు. తర్వాత ఆమె హయాంలోనూ వ్యక్తి ఆరాధన పరాకాష్టకు చేరుకుంది. జయలలిత మరణించే వరకు ఆ పార్టీలో ఆమెకు ఎదురులేదు.

ఆ కారణంగానే ఇప్పుడు ఆమె తదనంతరం 'ప్రజాభిమానం' పొందిన నాయకులంటూ ఎవరూ లేకుండా పోయారు. జయలలితను అమ్మ అంటూ కీర్తించినవాళ్లు రాత్రికి రాత్రి చిన్నమ్మ అంటూ సాగిలపడ్డారు. మరికొందరు జయలలిత బంధువర్గం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.

వ్యక్తి ఆరాధన ప్రజాస్వామ్యానికి, పాలనకు ఎంత చేటు తెస్తుందో జయలలిత రాజకీయం ఒక ఉదాహరణ. ఆమె ప్రకటించిన తాత్కాలిక తాయిలాలు తమ డబ్బుతోనే ఇస్తోంది తప్ప సొంత డబ్బు కాదనే స్పృహ కూడా ఆ రాష్ట్రంలో లేకుండా పోయింది. అవినీతి ఆరోపణల మీద జయలలిత జైలుకెళ్లినా.. ఎవరికి అమ్మ, ఎందుకు అమ్మ? అనే ప్రశ్నలు మాత్రం తమిళ సమాజంలో తలెత్తలేదు.

వ్యక్తిగతంగా రాజకీయాలలో ఎంతో ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కొని ఒక విప్లవస్థాయి విజయాన్ని సాధించిన మహిళగా జయలలిత నిలిచిపోతారు. అవకాశాలు, వనరులు ఉండి కూడా మౌనప్రేక్షకుల్లా దేశంలోని సమస్యల్ని, సంక్షోభాల్ని చూస్తున్న కోట్లాదిమందికంటే మిన్నగా ప్రజాజీవితం కోసం తన జీవితంలో చాలా సమయాన్ని ఆమె వెచ్చించారు. ఇందుకు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాల్సిందే. కానీ ప్రజల్ని ప్రభువులుగా నిలపాలన్న మౌలిక ప్రజాస్వామ్య సూత్రాన్ని పాటించటంలో విఫలమయ్యారు. ప్రజాసేవకు నిజమైన గీటురాయి వ్యవస్థీకృత నిజాయతీయే అని గుర్తిస్తే.. జయను విజేతగా పరిగణించలేం.

జయలలిత రాజకీయ జీవితం ఓటు వేసే ప్రజలకు, ఏకవ్యక్తి పార్టీల్ని, కేంద్రీకృత పాలనను నడుపుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల రాజకీయ నేతలకు కూడా హెచ్చరిక అని కూడా అంగీకరించాలి.

# రోజూ రూ.10,000 కోట్ల నల్లధనం: జేపీ



దేశంలో రోజూ వివిధ రూపాల్లో రూ. 10,000 కోట్ల నల్లధనం తయారవుతోందని, దీన్ని అరికట్టటానికి డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) మాత్రమే పరిష్కారం కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నవంబర్ 8, 2016న నోట్ల రద్దును ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటిస్తున్నప్పుడే తాను మద్దతిచ్చానని, అయితే ఒక మంచి ఆశయంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కనీస ఏర్పాట్లు కూడా చేయకుండా అమలు చేశారని అన్నారు. అంత అధ్వాన్నంగా అమలు చేస్తారని ఊహించలేదని, ప్రధానిని చుట్టూ ఉన్నవారెవరో తప్పుదోవ పట్టించారని అన్నారు. సన్నద్ధత లేకుండా, పార్లమెంటులో చర్చ లేకుండా ఏకపక్షంగా అమలు చేసిన నోట్ల రద్దు కారణంగా సామాన్య ఉద్యోగులు, చిరు వ్యాపారులు, అసంఘటిత రంగంలో పనిచేసేవారు, రైతులు ఇలా కోట్లాదిమంది కష్టాలు పడ్డారన్నారు. తమ డబ్బును తమ ఖాతాలో నుంచి తీసుకునే అవకాశం ప్రజలకు లేకుండా చేయటం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. ఇంత చేసినా, ప్రజలు ఏదో మంచి జరుగుతుందన్న ఆశతో కష్టాల్ని భరించారన్నారు. అవినీతిపై పెద్ద పోరాటం అవసరమని ఒక సంకేతం ఇవ్వటానికి నోట్ల రద్దు ఉపయోగపడుతుందని, అవినీతి, నల్లధనం అంతానికి మిగిలిన చర్యల్ని కూడా వేగంగా తీసుకోవాలన్నారు.

'నోట్ల రద్దు – భావి మార్గం'పై ఇండియా నెక్ట్స్ అనే సంస్థ చెన్నైలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేపీ కీలకోపన్యాసం చేశారు.

మన పాలనా వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో, ప్రజల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో డీమానిటైజేషన్ అమలు విస్పష్టంగా తెలియచెప్పిందని, ప్రజలు తాము పట్టే పన్నులకు తగ్గ సేవలను లంచాలు, వేధింపులు లేకుండా అందుకునేందుకు 'పౌర సేవల' గ్యారంటీ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని జేపీ అన్నారు. లోక్‌సత్తా రూపొందించిన చట్టం పార్లమెంటు ముందు పెండింగ్‌లో ఉందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో స్టాంప్ డ్యూటీ తగ్గింపు, భూముల విలువను మార్కెట్ స్థాయికి పెంచటం వంటి చర్యల్ని తీసుకోవటంతోపాటు రాజకీయ పార్టీల నిధుల సమీకరణ, ఎన్నికల వ్యయాన్ని ప్రక్షాళన చేసే సంస్కరణలు తీసుకురావాలన్నారు. ఓటుకు నోటు లేకపోతే ఓటింగ్ శాతం పడిపోవటం, ఓటమి ఖాయం అనే ప్రమాదకర విషసంస్కృతిలో అన్ని పార్టీలూ కూరుకుపోయి ఉన్నాయన్నారు. ఎన్నికలలో ఓట్ల కొనుగోలు కోసం నల్లడబ్బును సేకరించటంలో భాగంగా రాజకీయ, పాలనా వ్యవస్థల్లో అవినీతి విశృంఖల మవుతోందన్నారు. 'ఎన్నికలలో చట్టవిరుద్ధ మార్గంలో ఖర్చు చేయటానికి చట్టవిరుద్ధ మార్గంలో డబ్బు సేకరించటం' నల్లడబ్బు, అవినీతికి మూలంగా ఉందని, ఈ మూలాన్ని ఛేదించటానికి దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాలకు నేరుగా నిధులు, అధికారాలు వంటి మార్పుల్ని వేగంగా చేయాలన్నారు. ఇప్పటికే డీమానిటైజేషన్ వేడి చల్లారుతోందని, ఆలస్యమయ్యేకొద్దీ ఈ సంస్కరణల కోసం రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధన కష్టమవుతుందని అన్నారు. డీమానిటైజేషన్ వల్ల ఆశించిన ఫలితం దక్కటానికి ఈ సంస్కరణల్ని వేగంగా తేవటమే మార్గమన్నారు.

ప్రధానమంత్రి మాజీ సలహాదారు, కేంద్ర ప్రభుత్వ మాజీ అధికార ప్రతినిధి ఎస్. నరేంద్ర మాట్లాడుతూ, ఆర్థిక సంస్కరణలు, పాలనాపరమైన సమస్యలను దృష్టిలో పెట్టకోకుండా ప్రధాని తొందరపాటు నిర్ణయం తీసుకున్నారన్నారు. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేల స్థాయిలోని అవినీతి సమస్యను చర్చించి ముందు జాగ్రత్త చర్యలతో పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు.

వ్యాధి నివారణకు కొన్నిసార్లు చేదుమందులు, కొన్నిసార్లు సర్జరీలు కూడా అవసరమని డాక్టర్ సీఎంకే రెడ్డి అన్నారు.

నోట్ల రద్దును కూడా అదే దృష్టితో చూడాలన్నారు. గతాన్ని వదిలేసి ఎదురవుతున్న సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టాలన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త, ఇండియానెక్స్ట్ సలహామండలి వైస్ ఛైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కొందరు నల్లకుబేరులను పట్టుకునేందుకు ప్రజలందరినీ క్రిమినల్స్‌గా చూడటం సరికాదన్నారు. నోట్ల రద్దు తరువాత కూడా దేశవ్యాప్తంగా నెలకొన్న గందరగోళ పరిస్థితులను చక్కదిద్దటంలో ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించలేక పోయిందన్నారు. నోట్ల రద్దు వల్ల సినీ పరిశ్రమ కుంగిపోయిందని దక్షిణ భారత చలనచిత్ర మండలి గౌరవ కార్యదర్శి, నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ అన్నారు. థియేటర్లకు జనం తగ్గటంతోపాటు షూటింగ్‌లు ఆగిపోయాయన్నారు.




ఈ సమావేశం అభిప్రాయాలతో ఒక నివేదికను ప్రధానమంత్రి, ఆర్థికశాఖ స్థాయీ సంఘానికి సమర్పించాలని రౌండ్‌టేబుల్ తీర్మానించింది.

ఇండియానెక్స్ట్ ప్రధాన కార్యదర్శి మాలినేని అమరేంద్ర కార్యక్రమానికి స్వాగతోపన్యాసం చేశారు. తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, హిందూ దినపత్రిక అసోసియేట్ ఎడిటర్ కేటీ జగన్నాథన్, ఐఏఎస్ మాజీ అధికారులు ఎన్ మురుగన్, రాజ్‌కుమార్, ఛార్టెడ్ అకౌంటెంట్ల సంఘం దక్షిణాది రాష్ట్రాల విభాగం అధ్యక్షుడు వీ మురళి, సైబర్ సొసైటీ ఆఫ్ ఇండియా పాలనా మండలి ఛైర్మన్ వీ రాజేంద్రన్, ఐక్యరాజ్యసమితిలో సివిల్ ఉద్యోగి వీ హరిప్రసాద్, ప్రైం పాయింట్ ఫౌండేషన్ ఛైర్మన్ ఏ శ్రీనివాసన్, అడయార్ ఆనంద భవన్ మేనేజింగ్ డైరెక్టర్ కేటీ శ్రీనివాసరాజా, కేసీపీ సిమెంట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఏ శివరామప్రసాద్, విజయ్ హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ డీ రాంబాబు, ఎస్ఏఈ ఎండీ శేషాద్రి, సిమన్స్ అండ్ కంపెనీ కార్యదర్శి, కలప, బంగారు వ్యాపారవేత్త జోయల్ వక్తలుగా పాల్గొని తమ రంగాలలో నోట్ల రద్దు ప్రభావాన్ని, సాధకబాధకాలని వివరించారు.

ఇండియానెక్స్ట్ అధ్యక్షుడు జువ్విగుంట వెంకటేశ్వర్లు, కోశాధికారి పెమ్మసాని మురళి, సలహామండలి ఛైర్మన్ పద్మయ్య, పారిశ్రామికవేత్త అనిల్ కుమార్ రెడ్డి రౌండ్‌టేబుల్‌కు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

# పర్యావరణ బోధనలో కాలుష్యం లేకుండా చేయండి

డిగ్రీ కోర్సుల్లో పర్యావరణ విద్యను అర్హులైన అధ్యాపకులు బోధించటంలేదని, సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా చేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ పర్యావరణ శాస్త్రాల జేఏసీ లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీని కలిసి వినతిపత్రం అందచేసింది.



2003 సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పర్యావరణ విద్యను ప్రతి డిగ్రీ కోర్సులోనూ సబ్జెక్ట్‌గా తప్పనిసరిగా బోధించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ కళాశాలల్లో తగిన విద్యార్హతలు లేని బోధకులు పాఠాలు చెబుతూ సుప్రీంకోర్టు తీర్పుకి తూట్లు పొడుస్తున్నారని జేఏసీ వివరించింది. రాష్ట్రంలో 1991 నుంచి ఐదు విశ్వవిద్యాలయాలలో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్‌ని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుగా అందిస్తుండటం వల్ల సగటున ఏడాదికి 125మంది పట్టభద్రులవుతున్నారు కాబట్టి.. డిగ్రీ కోర్సుల్లో బోధనకు ఎంఎస్‌సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్‌ని కనీస అర్హతగా ఏర్పాటు చేయాలన్నారు. ఏయూ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ జేఏసీ పోరాటానికి లోక్‌సత్తా బాసటగా ఉంటుందని, అర్హులైన అధ్యాపకుల్ని నియమించాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరతామని బాబ్జీ హామీ ఇచ్చారు. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు బోణి అనిల్ కుమార్, సీహెచ్ దుర్గాప్రసాద్, బి. ప్రసన్న కుమార్, ఎం. ప్రవీణ్, లోక్‌సత్తా కార్యకర్తలు పి. శంకర్, రాజేశ్వరి, మిధున్ పాల్గొన్నారు.

# పార్టీల రణమా? ఎన్నికల సంస్కరణమా?



'నేరము' అనగానే.. 'శిక్ష' అనే పదాన్ని అసంకల్పితంగా ఉచ్ఛరించే దేశం మనది. రష్యన్ నవలా రచయిత దోస్తవెస్కీ 'క్రైమ్ అండ్ పనిష్‌మెంట్'ని ఆబగా చదివి చర్చోపచర్చలు చేసిన పాత తరంవారి సంగతైతే సరేసరి. 'పరిత్రాణాయ సాధూనాం'.. రేంజ్‌లో మాట్లాడతారు. వ్యక్తిగత స్థాయిలో ఇంత చక్కగా ఆలోచించే వాళ్లం కూడా.. మనందరి జీవితాల్ని అనునిత్యం అడుగడుగునా రాజకీయాల దగ్గరికొచ్చేసరికి నేరము తర్వాత శిక్ష అనలేకపోతున్నాం. 'నేరము - శిక్ష' కాస్తా.. 'నేరము - విజయం'గా మారిపోతోంది. మన వ్యక్తిగత, కుటుంబ స్థాయి విలువల్ని సామాజిక, రాజకీయ వ్యవస్థీకృత విలువలుగా ఎందుకు మార్చుకోలేకపోతున్నాం? లోపం ఎక్కడుంది?.. ఈ ప్రశ్నలకు పరిష్కారం వెతికే సందర్భాన్ని పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వివిధ ప్రాచుర్య రాజకీయ పార్టీలు తాజాగా చర్చిస్తున్న ఎన్నికల సంస్కరణల ప్రతిపాదన కల్పించింది. డీమానిటైజేషన్ కంటే ముందుగా వినిపించిన 'లోక్‌సభ - అసెంబ్లీలు - స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికల' ప్రతిపాదన దానంతటదే విప్లవాత్మకమైనది కాకపోయినా.. డీమానిటైజేషన్‌కి కొనసాగింపుగా చేయాల్సిన ఎన్నికల సంస్కరణల్ని కూడా జోడిస్తే ఒక మేలిమి మార్పుగా మారుతుంది.

ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన, అలాగే డీమానిటైజేషన్ లక్ష్యాలుగా చెబుతున్న నల్లడబ్బు, దాని చుట్టూ అల్లుకుని వున్న అవినీతిని అంతం చేయటం.. ఈ రెంటి మీదా ప్రజాభిప్రాయం, రాజకీయ పార్టీలూ సానుకూలంగానే ఉన్నందున సమయం వృధా చేయకుండా ఎన్నికల సంస్కరణలకు మోదీ ప్రభుత్వం చేతల్లో చొరవ తీసుకోవాలి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను అందుకు పూర్తిస్థాయి అవకాశంగా ఉపయోగించుకోవాలి. నోట్ల రద్దు, జీఎస్‌టీ నేపథ్యంలో ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ 2017-18 సమయంలోనే ఎన్నికల సంస్కరణలపై సరైన అడుగులు పడితే, ఇదో చరిత్రే అవుతుంది. ఊబి నుంచి దేశాన్ని బైటపడవేయటంతోపాటు.. అందులో కూరుకుపోయి అంతరించిపోతున్న పార్టీలకు కూడా కొత్త జవసత్వాలను ఈ సంస్కరణలను అందించగలుగుతాయి.

ఎన్నికల సంస్కరణలు అనగానే నేరచరిత్రులు, పార్టీల విరాళాలు, సంపన్న అభ్యర్థులు, నల్లడబ్బుతో ప్రచారం, ఓట్ల కొనుగోలు తదితర అంశాలన్నీ ప్రస్తావనకు వస్తాయి. కానీ కాస్త తరచి చూస్తే.. ఇవన్నీ ఒకే సంక్షోభానికి బహురూపాలు. ఒకే సమస్యకు పర్యాయపదాలు లేదా ఒకే రోగానికున్న రకరకాల లక్షణాలు అని కూడా చెప్పుకోవచ్చు. ఏమిటీ సంక్షోభం? ఏమిటీ రోగం?.. నేరచరిత్రుల నుంచే మొదలవుదాం.

ఎన్నికలలో నేరచరితులు పోటీచేయటం ప్రజాస్వామ్యానికి, దేశ ప్రయోజనాలకీ తీవ్ర నష్టం చేస్తుందంటూ నేరరాజకీయాలకు వ్యతిరేకంగా వ్యవస్థీకృత పోరాటానికి నాంది పలికింది లోక్‌సత్తా. ఎన్నికలలో పోటీ చేసే నేరచరిత్రుల జాబితాను 1999లో లోక్‌సత్తా విడుదల చేశాక ఎన్నికల సంఘం కూడా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. పోటీ చేసే ప్రతి అభ్యర్థీ తన వివరాలను తెలియచేయాల్సిందే అన్న ప్రతిపాదనకు వ్యతిరేకంగా బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదిస్తే, లోక్‌సత్తా అభ్యర్థన మేరకు అప్పటి రాష్ట్రపతి డా॥ ఏపీజే అబ్దుల్ కలాం ఆ బిల్లును తిప్పిపంపారు. చివరకు లోక్‌సత్తా సుప్రీంకోర్టులో పోరాటం చేసి.. ఎన్నికల్లో అభ్యర్థులు విధిగా తమ నేరచరిత్ర సహా వివరాలు వెల్లడించేలా చట్టాన్ని 2003లో సాధించింది. అయితే నేరచరిత్రులు వివరాలు వచ్చినా సమస్య పూర్తిగా తగ్గలేదు. వరకట్నం తీసుకోకూడదంటూ చట్టం ఉన్నంత మాత్రాన కట్నాలు తీసుకోవటం, వాటి కోసం వేధించటం ఆగకపోవచ్చు. కానీ ఆ చట్టం కూడా లేకపోతే పరిస్థితి మరీ దిగజారి అసలు రక్షణ లేకుండా పోతుంది. అలాగే.. నేరచరిత్రులు బరితెగించకుండా

అడ్డుకోవటానికి 2003 చట్టం కొంత ఉపయోగపడింది. అయితే 2014లో 56 కోట్ల మంది ప్రజలు 9,00,000 పోలింగ్ స్టేషన్లలో వేసిన ఓటు ద్వారా ఎన్నికైన 542 మంది ఎంపీలలో 34శాతం మంది నేరారోపణలు ఎదుర్కొన్నవారేనని గణాంకాలు చెబుతున్నాయి. గతంలో కంటే ఈ సంఖ్య పెరిగింది. నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు 2004లో 24శాతం ఉంటే, 2009లో 30శాతం ఉన్నారు.

2014లో గెలిచిన ఎంపీలలో 20శాతానికిపైగా ఎదుర్కొంటున్న ఆరోపణలు తీవ్ర నేరాలకు సంబంధించినవి. హత్యాప్రయత్నం, ప్రభుత్వాధికారులపై దాడి, దొంగతనం వంటి నేరాలలో వీరు నిందితులు. గత ఎన్నికల్లో అధికార బీజేపీ నిలబెట్టిన అభ్యర్థుల్లో 14శాతం మందిపై ఇలాంటి తీవ్ర నేరారోపణలున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల్లో 10శాతం మందికిపైగా ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారున్నారు.

ఎన్నికలలో గెలుపు కోసం పోటీ ఉన్నకొద్దీ తీవ్రతరమవుతోంది. గెలుపు ఓట్ల శాతం తగ్గుతోంది. 2009లో అయితే గెలుపు సగటు మార్జిన్ కేవలం 9.7శాతం. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌తోపాటు.. ఓట్లు, సీట్లు పొందిన అన్ని పార్టీలలో కళంకిత అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

దీర్ఘకాలంపాటు మనుగడ సాగించాలని, వీలైనంత ఎక్కువ కాలం అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండాలని, దేశానికి వీలైనంత మంచి చేయాలని అనుకుంటున్న నాయకులు, పార్టీలు కూడా ఎందుకు నేరచరిత్రులను ప్రోత్సహిస్తున్నాయా అంటే.. డబ్బు కోసం అన్నదే సమాధానం.

ఎందుకింత డబ్బు? భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో సుమారు 30లక్షల ప్రాతినిధ్య పదవులు ఉంటే.. వాటిలో పోటీపడి గెలవటానికి విపరీతమైన డబ్బు అవసరమవుతోంది. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల స్థాయిలో కాకపోయినా.. మిగిలిన చోట్ల కూడా డబ్బు ఎన్నికలలో పోటీకి ఒక కనీస అర్హతగా మారిపోయింది. ఎలాంటి నిధులు, అధికారాలు లేని మూడో అంచెలో (స్థానిక ప్రభుత్వాలలో) ఎన్నికలకు కూడా కోట్లు గుమ్మరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీకయ్యే నిర్వహణ ఖర్చుల్ని, అద్దె కార్యకర్తల్ని, కృత్రిమ సభల్ని భరించేందుకు నేరచరిత్రులే ఎక్కువగా ముందుకొస్తున్నారు. ఇటీవల వైట్‌కాలర్ ముసుగేసుకుంటున్న ఈ కళంకితులతో ఆర్థిక అవసరాల దృష్ట్యా చట్టబద్ధ పాలనను, న్యాయసంస్కరణల్ని ఫణంగా పెట్టి మరీ వీరిని నాయకులుగా పార్టీలు ప్రాజెక్ట్ చేస్తున్నాయి.

పార్టీలు కొందరు వ్యక్తుల సొంత ఎస్టేట్‌లుగా, వారి వంశస్తులు, కుటుంబీకుల వారసత్వ కంపెనీలుగా మారటంతో.. డబ్బున్న నేరగాళ్లు, అవకాశవాదులు నేరుగా రాజకీయాలలోకి ప్రవేశించి ఎన్నికలని హైజాక్ చేస్తున్నారు.

సరే, పార్టీలు టికెట్లిస్తున్నాయి. మరి ప్రజలకు తెలియదా వాళ్లు నేరస్తులని?.. ఈ ప్రశ్నకు జవాబు మళ్లీ మన రాజకీయ, పాలనా వ్యవస్థల వైఫల్యాన్నే ఎత్తిచూపుతుంది. నేరస్తులని తెలిసినా ప్రజలు చాలామంది అలాంటి అభ్యర్థులకు ఓటు వేస్తున్నారు. నిజానికి చాలామంది తమ నేరచరిత్రను దాచుకోవటానికి కూడా ప్రయత్నించటం లేదు. ఎన్నికల సంఘానికి నిబంధనల్లో దొరక్కుండా వీలైనంతమేర తమ నేరచరిత్రను ప్రచారం చేసుకుని ప్రజల్లో నెగెటివ్ హీరో ఇమేజ్‌ని పొందటానికి ప్రయత్నిస్తున్నారు. రాజకీయాలలో నేరచరిత్రులపై కొన్నేళ్లుగా పరిశోధనలు చేస్తున్న డా॥ మిలన్ వైష్ణవ్ విశ్లేషణ ప్రకారం.. నిజాయతీగల అభ్యర్థులు మళ్లీ గెలిచే అవకాశాలు 6శాతమే ఉంటే, నేరచరిత్రుల విజయావకాశాలు 18శాతం ఉంటున్నాయి. మూడు సాధారణ ఎన్నికల్ని పరిశీలించి ఈ వాస్తవాన్ని ఆయన నిగ్గుతేల్చారు. "ఎన్ని సుదీర్ఘంగా కేసులు పెండింగ్‌లో ఉంటే, అంత ఎక్కువగా విజయావకాశాలు" అని వ్యాఖ్యానించారు.

నేరరాజకీయం లాభసాటి వ్యాపారంగా మారటంతో ఈ ఒరవడి పెద్దఎత్తునే కొనసాగుతోంది. ఒక్కసారి ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యాక ఆదాయం పెరగనివారు అరుదు. శాసనసభ్యుల సరాసరి ఆదాయం 222శాతం పెరిగిందని 2013లో వెలువడిన ఓ అధ్యయనం తెలిపింది

ప్రజలు ఎందుకిలా రాజకీయాలలో నేరస్తులను ఎందుకు ఎన్నుకుంటున్నారంటే.. మళ్లీ లోక్‌సత్తా సుదీర్ఘకాలంగా చెబుతున్న అంశాలనే వైష్ణవ్ వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు రోజువారీ పనులు చేసిపెట్టటానికి, తమకు స్థానికంగా రక్షణ కల్పించటానికి, కులం, ప్రాంతం, మతం వంటి చీలికలలో తమకు ప్రయోజనం చేకూర్చటానికి, తమ వివాదాలు కోర్టు దాకా వెళ్లకుండా మధ్యవర్తులుగా పరిష్కరించటానికే నేరచరిత్రుల్ని ఎన్నుకుంటున్నారు. నేర రాజకీయనేతల్ని అభినవ రాబిన్‌హుడ్‌లలా భావిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు మిగతా ప్రజలకంటే అనేకరెట్లు జీతభత్యాలు, సదుపాయాల్ని అందిస్తున్నారు. ఒకేసారి వారి జీతాల్ని 40-50శాతం పెంచారు. ఒకసారి ఉద్యోగంలో చేరితే వారిని పీకటం దాదాపు అసాధ్యం. అయినా వారు తాము చేయాల్సిన పనులు చేయరు. ప్రభుత్వోద్యోగులు చేయాల్సిన పనులు చేసిపెట్టేందుకే ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటాం. వారు చట్టాలు, విధానాల గురించి ఆలోచించకుండా ఏ పార్టీ తరపున ఎన్నికైనా ప్రజలకు పనులు చేసిపెట్టే నెపంతో ప్రభుత్వ వ్యవహారాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో తలదూర్చు

తూంటారు. ప్రజలకు చేయాల్సింది చేయకపోయినా.. ప్రజాప్రతినిధులు చెప్పిందల్లా చేయటం, వారి కోసం ముడుపులు సమర్పించటం చేస్తుండటం వల్ల ప్రభుత్వోద్యోగులు కూడా లంచాలతో సంపాదనను ఓ మార్గంగా చేసుకుంటారు. ఇలా ఒక రాజకీయ–పాలనా అవినీతి విషవలయం ఏర్పడింది.

మరోవైపు, నేరరాజకీయనేతలనే ఎన్నుకోక తప్పని పరిస్థితుల్లో ఉన్నామని భావించే ప్రజల్లో చాలామంది ఓటుకున్న ప్రాధాన్యతను గుర్తించకుండా తాత్కాలిక అవసరాలకోసమే వినియోగిస్తున్నారు. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోవటమే అనే ప్రస్తుత ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ (ఎఫ్‌పీటీపీ) విధానంలో కొద్దిపాటి అదనపు ఓట్లకు ఉండే డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని ప్రతి ఎన్నికల్లో ఓటును డబ్బు సంపాదించే వన్ టైమ్ అవకాశంగా వారు భావిస్తున్నారు. ప్రచారం, ఇతరత్రా అవసరాలకన్నా ఓట్ల కొనుగోలుకే ఎన్నికల్లో పార్టీలకు డబ్బు ఎక్కువగా ఖర్చవుతోంది. నేరచరిత్రుల నుంచి పార్టీలు తీసుకునే డబ్బులో ఎక్కువశాతం ఇందుకోనవే వినియోగమవుతోంది. ఈ డబ్బంతా నల్లడబ్బేనని వేరే చెప్పనక్కర్లేదు. 'చట్టవిరుద్ధమైన (నల్ల) డబ్బు తీసుకుని చట్టవిరుద్ధమైన ఓట్ల కొనుగోలుకు ఖర్చు చేస్తుండటం' మన ఎన్నికల వ్యవస్థలోని సమస్యలకు కేంద్రబిందువుగా ఉంది.

ఈ నల్లడబ్బు ఇచ్చినందుకు, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టేందుకు నెలకి రూ.10లక్షల ఖర్చుతో పెద్ద యంత్రాంగాన్ని మెయింటెయిన్ చేస్తున్నందుకు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నందుకుగాను.. నేరచరిత్రగల ప్రజాప్రతినిధులు అనేకరెట్లు అక్రమంగా దండుకుంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటం + మధ్యవర్తిత్వ సెటిల్‌మెంట్లు + రక్షణ + ఓట్ల కొనుగోలు = ఎన్నికల్లో గెలుపు అవకాశాలు అనే ఫార్ములా నేరచరిత్రులకు అవకాశం కల్పిస్తుంటే.. ఈ పనులు చేసినందుకు దోపిడీ చేయటం వల్ల నల్లడబ్బు, అవినీతి రాజకీయం, పాలనా వ్యవస్థల్లో వేళ్లూనుకుపోయాయి. వ్యక్తిగతంగా అవినీతికి పాల్పడని ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి కూడా ఈ ఊబిలో భాగంగా మారిపోయి పరోక్షంగానో, మౌనంగానో అవినీతిని ప్రోత్సహిస్తున్నారు.

పేదరికం, అవిద్య విస్తారంగా ఉన్న దేశంలో ప్రజలకు ఓటు విలువ తెలియనివ్వని పాలనా, ఎన్నికల వ్యవస్థలు మనల్ని పట్టి పీడిస్తున్న అసలు సంక్షోభం, రోగం. ఈ సంక్షోభాన్ని, రోగాన్ని పరిష్కరించాల్సిన పార్టీ, పౌరసమాజ రాజకీయం తాత్కాలిక తాయిలాలు, చిట్కాలతో కాలక్షేపం చేస్తుండటం.. కొద్దిమంది స్వార్థనేతలు, వ్యక్తుల గుప్పెట్లో దేశం చిక్కుకుపోవటానికి, ప్రజాస్వామ్యంలో నిజమైన సార్వభౌములైన కోట్లాదిమంది ప్రజలు నివారించదగ్గ బాధలతో కన్నీరు కార్చటానికి కారణమయింది.

కాబట్టి..

1) ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించేలా 'పౌరసేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తేవటం. ఉన్నతస్థాయి అవినీతికి పాల్పడ్డ నేతలు, అధికారులపై స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తో విచారణ చేసి ఆస్తులు జప్తు సహా కఠిన చర్యలు తీసుకోవటం.

2) ఒక్క ఓటు ఎక్కువ వచ్చినవారే తప్ప మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే ప్రస్తుత ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థను మార్చి అదనపు ఓట్ల కోసం కోట్లు వెదజల్లాల్సిన అవసరం లేకుండా దామాషా ఎన్నికల వ్యవస్థను తీసుకురావటం

3) రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓట్ల కొనుగోలు, ఎమ్మెల్యేల ఫిరాయింపులకు అడ్డుకట్ట వేయటం

4) స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేసి దిగువ నుంచి మంచి నాయకత్వం వచ్చేలా చేయటం

5) పార్టీల్లో విరాళాల పారదర్శకత, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పే చర్యలు తీసుకోవటం

6) చట్టబద్ధ పాలన అమలు, వేగంగా, చౌకగా న్యాయం అందించటానికి స్థానిక న్యాయస్థానాలు తదితర ఏర్పాట్లు చేయటం

.. ఇటువంటి సంస్కరణలతో ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసి నిజాయతీ, సమర్థత ఉన్నవారు ఎన్నికయ్యే, ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించే వ్యవస్థను నిర్మించాలి.

ఒకేసారి ఎన్నికలకు 'జాతీయ స్థాయిలో నిర్మాణాత్మక అవిశ్వాసం' వంటి ఇంకొన్ని అదనపు చర్యల్ని చేపట్టాలి.

ఈ సంస్కరణల్లో కొన్నింటిని అమలుచేయటానికి పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధన కీలకం. ప్రజాభిప్రాయాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ నైపుణ్యంతో అందరినీ ఒక తాటిపైకి తేవాల్సుంటుంది. రాజకీయ సంకల్పం ఉంటే ఇవన్నీ ఆచరణసాధ్యాలే. ఏదోకస్థాయిలో అందరూ కోరుకుంటున్నవే.

ఇవి దేశంలో ఎప్పుడో రావాల్సిన మార్పులు. సరైన సమయంలో సాధించుకోలేకపోయినా.. కొంత నష్టంతోనైనా వీటిని సాధించటమే ఇప్పుడు మనం చేయగలిగింది.

మరోసారి సమయం మించిపోనివ్వకుండా.. బడ్జెట్ తరుణాన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకుని ఈ ఎన్నికల సంస్కరణల్ని సాధిస్తారా లేక తాత్కాలిక పార్టీ ప్రయోజనాల కోసం నటనలు, పరస్పర దూషణలతో మళ్లీ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారా అనేది తేలాల్సుంది.

పార్టీల రణమా?

ఎన్నికల సంస్కరణమా?

# ఓటర్లకు స్వేచ్ఛలేని ఎన్నికలతో ఒరిగేదేమిటి?

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**




ఈ ఎన్నికల్లో మున్నెన్నడూ లేనంతగా పార్టీ ఫిరాయింపులను చూస్తున్నాము. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలతోపాటు శాసనసభ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో ఈ కప్పదాటు రాజకీయాలు మరీ మితిమీరిపోయాయి. 97వ రాజ్యాంగ సవరణను కొంతకాలం క్రితమే మన పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించగా, అది రాష్ట్రపతి ఆమోదంతో చట్టమైంది. దాని ప్రకారం ఎన్నికయిన చట్టసభ సభ్యులు పార్టీ ఆదేశాన్ని ధిక్కరించి సభలో ఓటు వేస్తే వారందరి పదవులు పోతాయి. గతంలో 52వ సవరణ చేపట్టినప్పుడు, సభాపక్షంలో మూడో వంతుకు మించి సభ్యులు విప్‌ని ధిక్కరిస్తే వారిని చీలిక పార్టీగా గుర్తించే ఏర్పాటు చేశారు. దానివల్ల ఒకరిద్దరు పార్టీని ఫిరాయిస్తే వారికి సభ్యత్వం రద్దుకాగా, మూకుమ్మడిగా ఫిరాయిస్తే అధికారం, హోదా లభిస్తూ వచ్చాయి. ఇటీవల తెచ్చిన రాజ్యాంగ సవరణ పార్టీలలో ఆ విధమైన 'చీలిక'ను గుర్తించకుండా కట్టుదిట్టాలు చేసింది. అయితే అదంగా ఎన్నికల అనంతరం చట్టసభ సభ్యులకు వర్తిస్తుంది కానీ ఇప్పుడు వర్తించదు. ఎన్నికలకు ముందు ఫిరాయింపులను ఏ చట్టమూ ఆపలేదు. విధిగా ఫలానా పార్టీలోనే కొనసాగాలని ఏ పౌరుడినీ నిర్బంధించ లేము. అలాంటి చట్టమే మయినా చేస్తే అది తమకిష్టమయిన సంఘాలను ఏర్పరచటానికి, ఇష్టం వచ్చినవారితో కలిసి పనిచేయటానికి గల స్వేచ్ఛకు అవరోధ మవుతుంది. అలాంటి నిబంధన రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు వ్యతిరేకం కాబట్టి చెల్లదు. అయితే చట్టంతో, రాజ్యాంగంతో నిమిత్తం లేకుండా ఇలా పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం సిగ్గుచేటని మనందరికీ అనిపిస్తుంది. ఓ వంక పౌరుల స్వేచ్ఛను అరికట్టకుండా, మరోవంక ఈ ఆయారాం–గయారాం రాజకీయాలకు స్వస్తి చెప్పటమెలా?

**కొనసాగుతున్న గుత్తాధిపత్యం**

ఇదే సమస్యను మరో కోణంలో నుంచి చూడవచ్చు. 1991లో చేపట్టిన ఆర్థిక సంస్కరణలు అంతక్రితం లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్యంలో హరించి వేసిన వ్యక్తి స్వేచ్ఛను పునరుద్ధరించటానికి ఉద్దేశించినవి. ఆనాటి వరకు ఓ వ్యాపారం చేయాలన్నా, పరిశ్రమను స్థాపించాలన్నా ఎన్నో చట్టపరమయిన ప్రతిబంధకాలు ఉండేవి. ఆ విధంగా కొద్దిమందికి లైసెన్సుల పేరిట గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టారు. 1991లో ఆ విధమైన కృత్రిమ అడ్డుగోడలను తొలగించారు. అలాగే ఆనాడు వినియోగదారులకు మార్కెట్‌లో వస్తువులు ఎంచుకునే అవకాశం కూడా లేదు. గుత్తాధిపత్యం ఉన్న పరిశ్రమ, లేదా వ్యాపారస్తుడు అమ్మిన వస్తువులను వాళ్లు చెప్పిన ధరకు కొనుక్కోవటం తప్ప గత్యంతరం ఉండేది కాదు. పోటీ లేకపోవటం వల్ల కోట్లమంది సామాన్యులు అధిక ధరలకు నాసిరకం ఉత్పత్తులను కొని నిట్టూర్చాల్సి వచ్చేది. అలాంటి దోపిడీని, దివాళాకోరు విధానాలను అంతం చేయటానికి 1991లో ఆర్థిక సంస్కరణల పేరుతో అంకురార్పణ జరిగింది. దాని పర్యవసానంగా గుత్తాధిపత్యం పోయి పోటీ పెరిగింది. పలుకుబడి, రాజకీయ అండ లేని ఎందరో పరిశ్రమలు పెట్టుకుని ఉత్పత్తి చేయటం సాధ్యమయింది. వినియోగదారులకు వివిధ ఉత్పత్తుల మధ్య నచ్చినవాటిని ఎంచుకునే అవకాశం కలిగింది. నాణ్యత పెరిగి ధరలు అదుపులోకి వచ్చాయి. పరిశ్రమల సామర్థ్యం, ఉత్పాదకత పెరిగాయి. ప్రపంచ పోటీలో కూడా క్రమక్రమంగా నిలదొక్కుకోగలుగుతున్నాము. కానీ మన రాజకీయంలో మాత్రం ఇంకా పలుకుబడిలేనివాళ్లు బలమైన అభ్యర్థులుగా మన ముందుకు వచ్చే అవకాశం లేదు. చిత్తశుద్ధి, సామర్థ్యం ఉన్నా, ప్రజలకు సరయిన సేవలందించే శక్తి ఉన్నా, సమాజానికి పనికొచ్చే భావాలు, విధానాలు, ఆలోచనలు ఉన్నా, వారికి నేటి రాజకీయంలో స్థానం లేదు. కొందరి గుత్తాధిపత్యం నేటికీ అలాగే కొనసాగుతోంది. పౌరులకు సమర్థులయిన ప్రతినిధులను ఎంచుకునే స్వేచ్ఛ లేకుండా పోయింది. రాజకీయంలో స్వేచ్ఛ అంటే పార్టీలను ఇష్టంవచ్చినట్టు ఫిరాయించే హక్కుగా మనం భావించలేం. చాలా ఫిరాయింపులు కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పదవుల కోసం జరిగేవే కానీ ఓటర్లకు ఎంపికచేసుకునే స్వేచ్ఛను పెంచటానికి ఉద్దేశించినవి కావు. నిజానికి నేడు ప్రధాన పార్టీలన్నీ ఒకే మూసలో ఉన్నాయి, అన్నీ ఒకే తానులో

ముక్కలే. ప్రతి పార్టీ నేతలు తాము ఇతర పార్టీలకన్నా విభిన్నమైన వారమని కనిపించటానికి చాలా తాపత్రయ పడుతున్నారు. అందుకోసం వాగ్బాణాలను సంధిస్తున్నారు. కొత్త నినాదాలను లేవనెత్తుతున్నారు. కానీ వాస్తవానికి అన్ని పార్టీలు ఒకేరీతిలో నడుస్తున్నాయి. అందుకే ఎన్నిక 'స్వేచ్ఛగా' 'న్యాయంగా' జరిగినా, ఓటర్లుగా మనం మోసపోతున్నామనే భావం కలుగుతోంది. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయాలు కరవయ్యాయి. అలాగే రాజకీయవాదులు ఎప్పటికప్పుడు గోడదాటి పార్టీలు ఫిరాయిస్తున్నారు. అదేమంటే అన్ని పార్టీలు ఒకేరకంగా ఉన్నాయి కదా అని వాదిస్తున్నారు. నిజానికి, జెండా, నాయకుల పేర్లు, పార్టీ ఎన్నికల చిహ్నం మినహాయిస్తే, వివిధ పార్టీల మధ్య గుర్తించదగ్గ తేడాయే లేకుండా పోతోంది. ఏ రోజున, ఎవరు, ఏ పార్టీలో దర్శనమిస్తారో ఊహించటం కూడా అసాధ్యమయిపోతోంది. ఓ పార్టీలో అగ్ర నాయకత్వం తప్ప ఎవరయినా, ఎప్పుడయినా పార్టీలు మారవచ్చు. కొన్ని సందర్భాలలో అగ్రనాయకులు కూడా సులువుగా పార్టీ మార్చేశారు. 1980లో భజన్‌లాల్ హర్యానా ముఖ్యమంత్రిగా ఉంటూనే తన రాష్ట్రంలో జనతా పార్టీ మొత్తంతో సహా కాంగ్రెస్‌లో కలసిపోయారు. అలాగే 1991లో గుజరాత్‌లో చిమన్ భాయ్ పటేల్ జనతాదళ్ ముఖ్యమంత్రిగా ఉంటూనే, తన మొత్తం పార్టీ సభ్యులతో కాంగ్రెస్‌లో చేరిపోయారు! పార్టీలను మార్చటం షేర్ మార్కెట్‌లో ఓ కంపెనీ వాటాలు అమ్మేసి మరో కంపెనీ షేర్లు కొనుక్కోవటమంత సులువయిపోయింది. కేవలం ఈ లావాదేవీల వల్ల వచ్చే లాభం, తాత్కాలిక లబ్ధి మాత్రమే ప్రధానమయిన అంశాలు.

అయితే పౌరులుగా మనం రాజకీయాలలో కోరుకునేది ఇలాంటి 'పోటీ', 'స్వేచ్ఛ' కాదు. అలాంటప్పుడు స్వేచ్ఛ, పోటీ, పౌరులకు ఎంచుకునే అవకాశం – వీటిని సిద్ధాంతాలు, నీతి నియమాలు, ప్రజాసంక్షేమంతో సంధానించటం ఎలా? మనం గౌరవించి, విశ్వసించే రాజకీయ వ్యవస్థను నిర్మించాలంటే ఈ ప్రశ్నకు సమాధానాన్ని వెదకాలి. ప్రజలకు ఎంచుకోటానికి సరయిన అవకాశాన్ని ఇవ్వటం ఎలా? నిజమయిన పోటీని, భావసంఘర్షణను పెంచటం ఎలా? సమర్థులకు, సచ్ఛీలురకు నాయకత్వ అవకాశాల్ని కల్పించటంఎలా? రాజకీయరంగంలో స్వేచ్ఛను విస్తరించటం ఎలా?

## నిజమైన ప్రజాస్వామ్యం

ఇందుకు నాలుగు మార్గాలున్నాయి.

మొదటిది: రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కావాలి. ప్రస్తుతం వివిధ నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తిగా ఆ పార్టీ అగ్ర నాయకత్వ నిర్ణయం మీద ఆధారపడి ఉంది. చాలా పార్టీల్లో అసలు పార్టీ నాయకత్వమే ఎన్నికలు లేకుండా కేవలం నామినేషన్ల ద్వారా అధికారం చేపట్టింది. గతంలో ఒక పరిశీలకుడన్నట్టు, మనదేశంలో బలవంతంగా కిరీటాన్ని లాక్కుని తన నెత్తి మీద పెట్టుకున్నవాడే రాజు! ఆ తరవాత అతడికి ఎదురుండదు. ఇలాంటి నిరంకుశ సంస్కృతిలో పార్టీ సభ్యులు కేవలం పల్లకీలను మోసే బోయీలుగా మారిపోయారు. తమ నియోజకవర్గంలో తమ పార్టీ తరఫున అభ్యర్థులెవరో ఎంచుకునే హక్కు సభ్యులకు లేదు. పై వాళ్లు ఎవర్ని తమ నెత్తిన రుద్దితే వాళ్లే తమ నాయకులు! అభ్యర్థిత్వాన్ని ఆశించేవారి మధ్య ఆరోగ్యకరమైన పోటీ లేకుండా పోవటంతో, నాయకత్వం ఎదిగే అవకాశం లేదు. తమ సిద్ధాంతాలను ప్రజల ముందు పెట్టి మన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను అన్వేషించే సంప్రదాయం గాలికెగిరి పోయింది. ఇటీవలే అమెరికాలో అధ్యక్ష పదవికి డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించటానికి జరిగిన ప్రాథమిక ఎన్నికలను చూస్తే ఈ తేడా స్పష్టమవుతుంది. ఆ దేశంలో కొన్ని నెలలపాటు బహిరంగంగా, పారదర్శకంగా, స్వేచ్ఛగా అన్ని రాష్ట్రాలలోను అభ్యర్థి ఎంపిక కోసం పార్టీ సభ్యుల మధ్య ఎన్నిక జరిగింది. కేవలం ప్రజల, పార్టీ సభ్యుల నిర్ణయం ప్రకారమే చివరికి అభ్యర్థి నిర్ణయం ఖరారయింది. పార్టీ నాయకుల ప్రమేయం కాని, పెత్తందార్ల ఒత్తిడి కాని లేవు. మార్చిలో 'సూపర్ ట్యూస్‌డే' పేరుతో పది పెద్ద రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో బ్యాలట్‌లను లెక్కించే వరకు అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదు. ప్రాథమిక ఎన్నికల్లో వివిధ దశల్లో హోవర్డ్‌డీన్, జాన్ ఎడ్వర్డ్స్, జో లిబర్‌మన్, డిక్ గెఫార్డ్, వెస్లీ క్లార్క్ – అందరికీ ఎన్నికయ్యే అవకాశాలు వచ్చాయి. చివరికి అధిక సంఖ్యాక సభ్యుల మద్దతుతో జాన్ కెర్రీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. అదీ పార్టీలలో నిజమైన అంతర్గత ప్రజాస్వామ్యం అంటే.

రెండవది: రాష్ట్ర యూనియన్ స్థాయిలలోని గుత్తాధిపత్యం, అధికార కేంద్రీకరణ అంతం కావాలి. స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలను, బాధ్యతలను అప్పగిస్తే, ప్రజలకు నిజంగా సమర్థులను ఎంచుకునే అవకాశం లభిస్తుంది. పార్టీ కార్యకర్తలకు సరయిన అవకాశాలు పుష్కలంగా దొరుకుతాయి.

ప్రస్తుతం యూనియన్ (కేంద్ర), రాష్ట్రాల స్థాయిల్లో కేవలం 5,000మంది చట్టసభ సభ్యులను మాత్రమే దేశమంతటా ప్రజలు ఎన్నుకుంటున్నారు. ఈ పదవులు మాత్రమే కీలకం కావటంతో, ఏదో ఒక విధంగా తమ పార్టీ టికెట్లను, ఈ పదవులను పొందటానికి రాజకీయవాదులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇలా పదవుల కోసం పడే ఆరాటం, కుమ్ములాటలు, అతి విధేయత, బల ప్రదర్శనలు, అవకాశం చేజారిపోతే ఎగసిపడే ఆగ్రహజ్వాలలు, పెల్లుబికే అసమ్మతి – ఇవన్నీ జుగుప్సాకరంగా తయారయ్యాయి. చివరికి పార్టీలకు, ప్రజాస్వామ్యానికి ఈ ధోరణులు ప్రతిబంధకంగా అవుతున్నాయి. రాజకీయంలో పదవులు ఆశించటం పాపం కాదు. స్థానిక ప్రభుత్వాలకు నిజమయిన అధికారాలు కట్టబెట్టి, ఆ విధంగా కీలకమయిన పదవులను పెంచి, అదనపు అవకాశాలను కల్పించినట్టయితే, ఎందరో ఆసక్తి సామర్థ్యం ఉన్న రాజకీయవాదులకు సరయిన స్థానం దొరుకుతుంది. ఆ విధంగా వారి శక్తిసామర్థ్యాలను, నాయకత్వ పటిమను ప్రజాసంక్షేమానికి వినియోగించుకోవచ్చు. అలాంటి పరిస్థితి లేకపోవటంతో

ప్రస్తుతం వాళ్ల శక్తంతా ప్రత్యర్థులను, తమకు పోటీకి వచ్చే వాళ్లను అణచివేసే ప్రయత్నంలోనే వృథా అవుతోంది!

మూడోది: కొత్త రాజకీయ శక్తులు, చిన్న పార్టీలు ఎదిగే అవకాశాలు కరువవటంతో గుత్తాధిపత్యం కొనసాగుతోంది. ప్రస్తుతం దాదాపు అన్ని పెద్ద రాష్ట్రాల్లోను ఓ పార్టీకి 35శాతం మించి ఓట్లు పడితేనే గణనీయ సంఖ్యలో స్థానాలు పొందే అవకాశం ఉంది. ఆ కారణంగా వాస్తవానికి దేశంలో దాదాపు అన్ని పెద్ద రాష్ట్రాల్లోను రెండే ప్రధాన పార్టీలు ఎన్నికలలో పోటీ పడుతున్నాయి. ఆ పార్టీలవారు మాత్రమే చట్టసభ సభ్యులయ్యే అవకాశముంది. మిగిలిన పార్టీలు నామమాత్రమవటంతో పోటీ పరిమితమయింది. ప్రజలకు సరైనవాళ్లను ఎంచుకునే అవకాశం లేదు. ఎన్నికల్లో ఇరు అభ్యర్థులు 'దొందు దొందే'గా దర్శనమిస్తున్నారు. అలాగే మంచి అభ్యర్థులకు కూడా ప్రస్తుత ఎన్నికలు నిరుత్సాహాన్ని కలగజేస్తున్నాయి. స్థానికంగా కులబలం, పెద్దఎత్తున అక్రమ ఖర్చు లేకపోతే గెలుపు దాదాపు అసాధ్యంగా మారింది. అన్నింటినీ మించి, ఓడిన అభ్యర్థులకు, పార్టీలకు నియోజకవర్గంలో పడ్డ ఓట్లకు ఏ విలువా లేకుండా నిరర్థకమయిపోతున్నాయి. సగం కంటే తక్కువ ఓట్లు పడ్డ పార్టీకి అధికారం దక్కి, అధిక సంఖ్యాకుల అభిప్రాయాలకు గౌరవం లేకుండా పోయింది. అలా ప్రజాస్వామ్యం పలచనయింది. ఇవన్నీ నియోజకవర్గాల వారీగా ఒక్కొక్క ప్రతినిధిని ఎన్నుకోవటం వల్ల వచ్చిన తంటాలు. ఈ ఎన్నికల వ్యవస్థలో సరయిన పోటీగానీ, ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే అభ్యర్థుల పాత్రగానీ ఉండవు. అలాగే చాలా సందర్భాలలో ఓటర్లకు ఓ గడ్డు సమస్య ఎదురవుతుంది. తమకు నచ్చిన అభ్యర్థి తాము మెచ్చే పార్టీలో ఉండకపోవచ్చు. ఎందరో ఓటర్లు ఎన్నికలలో ఈ సంకటం నుంచి బయటపడలేకపోతున్నారు. ఈ సమస్యలకు సమాధానం పార్టీలకు ఓ రాష్ట్రంలో పడ్డ ఓట్ల శాతాన్ని బట్టి ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికయ్యే దామాషా పద్ధతి. బ్రిటన్ కూడా తిరస్కరించిన ఎన్నికల వ్యవస్థను, ఇతర సాంప్రదాయాలను ఈనాటికీ మనం పట్టుకుని వేళ్లాడుతున్నాం!

దామాషా పద్ధతి ఎన్నికల్లో కూడా కొన్ని సమస్యలున్నాయి. వాటిని పరిష్కరిస్తూ మనదేశ పరిస్థితులకు అనువుగా ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతిలోనే మిశ్రమ పద్ధతిని రూపొందించుకోవాలి.

ఆ విధంగా వివిధ పార్టీల మధ్య, భావాల మధ్య నిజమైన పోటీ ఉంటుంది. ప్రజలకు మంచి అభ్యర్థులను, నచ్చిన పార్టీలను ఎన్నుకునే అవకాశం పెరుగుతుంది. నియోజకవర్గంలో ప్రాతినిధ్యం కోసం, పార్టీకి, అభ్యర్థికి మధ్య ఎంచుకోవటం తేలికవటం కోసం, సగంమంది ప్రతినిధులను ఇప్పటిలాగా నియోజకవర్గాల ద్వారా ఎన్నుకోవచ్చు. మిగిలిన సగం మందిని పార్టీ జాబితాల ద్వారా దామాషా పద్ధతిలో ఎన్నుకోవచ్చు. మొత్తం మీద చట్టసభలలో సభ్యులు ఓట్ల నిష్పత్తిలో ఉండేలా చర్యలు తీసుకోవచ్చు. అలాగే మరీ చిన్న చిన్న పార్టీలు వచ్చి అస్థిరత్వాన్ని పెంచకుండా, సమాజాన్ని కులం పేరుతో మరింతగా ఛిన్నాభిన్నంగా చేయకుండా, కనీసం 10 లేదా 15శాతం ఓట్లు రాష్ట్రంలో వచ్చిన పార్టీలకు మాత్రమే సీట్లు దక్కేలా ఏర్పాట్లు చేయవచ్చు. ఈ శాతాన్ని పోటీని ప్రోత్సహించేందుకు వీలుగా మరీ ఎక్కువ చేయరాదు. అలాగే కులం పేరుతో చిన్న పార్టీలు సమాజాన్ని చీల్చటాన్ని నిరోధించేందుకు వీలుగా మరీ తక్కువ కాకుండా ఉండాలి. ఆ విధంగా పోటీ, స్వచ్ఛత, ప్రజల ముందు ఎంపిక చేసుకునే అవకాశాలు పెరుగుతాయి.

## ప్రత్యక్షంగా నేత ఎన్నిక

రాజకీయంలో పోటీని, స్వేచ్ఛను, ప్రజల నిర్ణయాధికారాన్ని పెంచే నాలుగో చర్య రాష్ట్రాధినేతల ప్రత్యక్ష ఎన్నిక. మన ప్రస్తుత వ్యవస్థలో పౌరులు ప్రతినిధులను నియోజకవర్గాలలో ఎన్నుకుంటే, వారు తమకిష్టమయిన నాయకుడి ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. వాస్తవానికి ప్రజల ఓటు నాయకుల మీద తీర్పులాగా తయారయింది. ప్రజల దృష్టిలో నేటి ఎన్నిక వాజపేయి – సోనియా గాంధీల మధ్య, లేదా జయలలిత – కరుణానిధిల మధ్య, లేదా చంద్రబాబు నాయుడు – రాజశేఖర రెడ్డిల మధ్య జరుగుతోంది. కానీ రేపు ఎన్నిక పూర్తయ్యాక, మనమెన్నుకున్న ప్రతినిధులు ప్రజల అభీష్టం మేరకు నాయకులను ఎన్నుకుంటారన్న హామీ ఏమీ లేదు. కొన్ని రాష్ట్రాలలో అర్ధరాత్రి కుట్రలతో నాయకత్వం క్షణాల మీద మారుతున్నది. ప్రజల ఓటుకు, ప్రభుత్వం ఏర్పాటుకు మధ్య సంబంధం స్థిరంగా లేదు. ఓసారి ఎన్నికయిన ప్రతినిధుల ఇష్టారాజ్యంగా చెలామణి అవుతోంది. శాసనసభ్యుల చేతుల్లో ప్రభుత్వం బందీ అవుతోంది. కాబట్టి అవినీతికి, ఆశ్రితపక్షపాతానికి, అన్యాయానికి అంతులేకుండా పోతోంది. దుష్పరిపాలన తప్పడం లేదు. అధికారమంటే బదిలీలు, కాంట్రాక్టులు, నేర పరిశోధనలో జోక్యం, ప్రత్యర్థులను వేధించటంగా మారిపోయింది. ఈ పరిస్థితి పోవాలంటే చట్టసభకు, ప్రభుత్వానికి మధ్య రాష్ట్రాలలో అడ్డుగోడ ఉండాలి. ప్రభుత్వాధినేతను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. ప్రభుత్వం స్వేచ్ఛగా ప్రజల తీర్పు మేరకు నిర్ణయాలు చేయగలగాలి. చట్టసభ శాసనాలు చేయటంలో, ప్రభుత్వాన్ని అదుపుచేయటంలో కీలకపాత్ర వహించాలి.

నిజమైన ఆర్థిక సంస్కరణలు పోటీని పెంచి, సామర్థ్యాన్ని, నాణ్యతను ప్రోత్సహిస్తాయి. ధరలను తగ్గుముఖం పట్టిస్తాయి. అయితే స్వేచ్ఛ, పోటీ ఆర్థిక వ్యవస్థలోనే కాదు.. రాజకీయంలోనూ రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది. నిజమైన నాయకత్వం ఎదుగుతుంది. మనం సార్వభౌములవుతాం. అప్పటిదాకా ఈ ఎన్నికలు కేవలం ఓ అధికారక్రీడ మాత్రమేతప్ప మన స్వేచ్ఛకు, స్వపరిపాలనకు సంకేతాలు కావు.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఏప్రిల్ 5, 2004న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)

# చదివేది ఏడు - పేరు రాసుకోవటం కూడా రాదు!





మహబూబ్‌నగర్ కలెక్టర్ రొనాల్డ్ రాస్ ఇటీవల మిడ్జిల్ మండలం వల్లభరావుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఏడో తరగతికి వెళ్లారు.

'తెలుగులో మీ తల్లిదండ్రుల పేర్లు రాయండి' అని విద్యార్థులకు సూచించారు. తరగతి గదిలో 20 మంది ఉంటే ఒక్కరు కూడా తప్పుల్లేకుండా రాయలేకపోయారు.

'మీ పేర్లు రాయండి' అని అడిగారు. అప్పుడు కూడా అదే పరిస్థితి.

'మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారు' అని పాఠశాల ఉపాధ్యాయులను రాస్ ప్రశ్నించారు. 'జిల్లా కేంద్రంలోని ప్రైవేటు స్కూళ్లలో' అని వారు సమాధానం చెప్పారు.

దీంతో చదువు చెప్పకుండా అన్యాయం చేస్తున్నారంటూ కలెక్టర్ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడుగురు టీచర్లలో ఐదుగురిని సస్పెండ్ చేయాలని ఎంఈవోకు సూచించారు.

ఈ ఘటననే ఇంకా పొడిగించి ప్రైవేటు స్కూళ్లలో మంచి చదువు అందుతోందా అంటే.. అక్కడా లేదని అసర్ సర్వేలు, ప్రభుత్వ విద్యాశాఖ స్వయంగా చేయించిన అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి.

స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్‌కి - అక్షరాస్యతకు - పరీక్షలకు - మార్కులకు - జీవితంలో ఎదిగే అవకాశాలకు సంబంధం లేకుండా పోయింది.

విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వం అందరూ విద్యలో సక్సెస్ కావాలని ఎంతో తపన పడుతున్నా.. ఆ దిశగా విద్యావ్యవస్థను సంస్కరించే ప్రయత్నం చేయటం లేదు.

ఇటీవల తెలంగాణ పురపాలక శాఖా మంత్రి కె.తారకరామారావు మూడవ తరగతి చదువుతున్న తన కుమార్తె స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశానికి హాజరవటం తనకెంతో ఉత్కంఠను కలిగించిందని, అసెంబ్లీ సమావేశాలు, బహిరంగ సభల్లో మాట్లాడటానికి కూడా తాను అంతగా ఆలోచించలేదని అన్నారు. వ్యక్తిగతంగా చదువుకు అంత ప్రాధాన్యత ఇస్తున్న నాయకులు.. సమాజంలో ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలను అందించేలా విద్యావ్యవస్థను ఎందుకు తీర్చిదిద్దలేకపోతున్నారు?

అందరికీ ఎదిగే అవకాశాలకు కీలకమైన విద్య, ఆరోగ్యం విషయంలో తగిన చర్యలు తీసుకోవటంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కూడా ఇంతవరకూ ఒక్క అడుగూ ముందుకు వేయలేకపోయింది. నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందరికీ అందుబాటులో లేకుండా దేశం ఏమి సుస్థిరాభివృద్ధిని సాధించగలుగుతుంది అనే ప్రశ్నే కేంద్రానికి తట్టటం లేదు.

(పాఠశాల విద్యలో సంస్కరణలపై లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ కేంద్రప్రభుత్వానికి సమర్పించిన నోట్‌ను www. fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు).

# ఎస్‌కే డే మళ్లీ ఇన్నాళ్లకు గుర్తుకొచ్చారు



Mr SK Dey, Minister for Community Development and Cooperation, receiving Che at his office in New Delhi on July 3, 1959.
Photo courtesy: Photo Division, Government of India

ఎప్పుడో 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు జూన్‌లో నిర్వహించిన తొలి సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సోషల్ ఇంజినీర్, దేశ తొలి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ శాఖా మంత్రి ఎస్‌కే డే గురించి చెప్పారు. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అమెరికా వెళ్లినప్పుడు ఆ దేశ అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ భారత ఉపఖండం నుంచి వచ్చిన ఓ గొప్ప వ్యక్తిని పరిచయం చేస్తానంటూ ఎస్‌కే డేని పరిచయం చేశారని, స్వదేశంలో పనిచేయాలని డేకి నెహ్రూ ఆహ్వానం పలికినా విధానాలు మార్చుకుంటేనే వస్తానని డే చెప్పారని, సలహాదారుగా ఉండటానికి మాత్రం అంగీకరించారని కేసీఆర్ వివరించారు. చివరికి డేకి తగిన స్వేచ్ఛనివ్వటానికి నెహ్రూ అంగీకరించి గ్రామీణాభివృద్ధి కోసం సహకార, సామాజికాభివృద్ధి మంత్రిగా నియమించటంతో.. అమెరికా నుంచి భారత్‌కి వచ్చిన ఎస్‌కే డే హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఎన్ఐఆర్‌డీని స్థాపించారన్నారు. ఇక్కడి నుంచే పంచాయతీరాజ్ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు పునాది వేసిన డే స్ఫూర్తితో అధికారాన్ని గ్రామాలకు వికేంద్రీకరిస్తానని, కమ్యూనిటీల భాగస్వామ్యంతో స్థానిక పాలనని పటిష్టం చేస్తానని ఆనాడు కేసీఆర్ ఎంతో ఉత్తేజకరంగా చెప్పారు. ఆ తర్వాత గ్రామప్రణాళికలు అంటూ హడావుడి చేశారు. గ్రామాల సాధికారతకు గ్రామజ్యోతిని ప్రారంభించి ఏటా రూ.5,000కోట్లు ఇస్తామని దాటవేస్తూ వచ్చారు. చివరికి మళ్లీ 2017 జనవరిలో ఓ ప్రైవేటు ట్రస్టు ప్రారంభోత్సవంలో మళ్లీ ఎస్‌కే డే, గ్రామస్వరాజ్యం గురించి కేసీఆర్ మాట్లాడారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఏం చేసినా గ్రామాల్లో స్థానిక పాలన బలంగా ఉంటేనే ప్రజలకు పనులు సక్రమంగా జరుగుతాయన్నారు. పంచాయతీరాజ్ ఉద్యమం ఓ దశలో చైతన్యవంతంగా నడిచిందని, ఇప్పుడు స్తబ్దుగా ఉందని, ఈ విరామాన్ని తొలగించాలని అన్నారు. పంచాయతీరాజ్, సహకార వ్యవస్థల్ని రాజకీయమయం చేసి ఉక్కిరిబిక్కిరి చేసి నాశనం చేశారని, ఇప్పుడు సర్పంచ్‌గా గెలవాలంటే కోట్లు ఖర్చు పెట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. సరేగానీ, కేసీఆర్‌గారూ! లోక్‌సత్తా ఎన్నో ఏళ్ల నుంచి మొత్తుకుంటున్న విధానాల్ని చెప్పటం వరకూ బాగానే ఉంది. లోక్‌సత్తాకు ఇంకా అధికారం రాలేదు కాబట్టి.. విధానాల రూపకల్పన, ప్రజలను చైతన్యపరచటం, నయానో భయానో పాలకులను ఒప్పించటం వంటి మార్గాల ద్వారానే ప్రయత్నం చేయగలదు. కానీ స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ఇచ్చే అధికారంలో ఉన్న మీరు కూడా కేవలం చైతన్య కార్యక్రమాలకే పరిమితమవటం ఏం సబబు? ప్రజల సాధికారత పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. వెంటనే స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలను బదిలీ చేయండి, వార్డు స్థాయి వరకూ తలసరి రూ.1000–2000 రాష్ట్ర బడ్జెట్ నుంచే కేటాయించండి. మీరు చిత్తశుద్ధితో ముందుకొస్తే.. లోక్‌సత్తా, అధికార వికేంద్రీకరణ పట్ల నిబద్ధత గల సంస్థలు, వ్యక్తులు మీకు తగిన అండదండల్ని అందిస్తారు.

# జాతీయ మద్యం విధానం కోసం కృషి: సుప్రీం తీర్పు అమలు కమిటీ



రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన మద్యం దుకాణాలను మూసివేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కాగా అమలుచేయాలని అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా॥ అంబటి లక్ష్మణరావు కోరారు. ఈ తీర్పు అమలుకోసం తాము ఏర్పాటు చేసిన కమిటీ జాతీయ ఎక్సయిజ్ విధానం రూపకల్పనదిశగా కూడా కృషి చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు కమిటీలో జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ చంద్రకుమార్, అబ్కారీ శాఖ విశ్రాంత కార్యదర్శి ప్రభాకర్, పీవోడబ్ల్యు అధ్యక్షురాలు సంధ్య, అప్సా డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. రహదారుల పక్కన మద్యం దుకాణాల వల్ల మత్తులో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఏటా లక్షన్నరమంది రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నారని, ఈ సంఖ్య పెరుగుతోందని జస్టిస్ లక్ష్మణరావు అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో నియంత్రణతో కూడిన జాతీయ ఎక్సయిజ్ విధానం తయారీ ఆవశ్యకతపై ప్రధానికి లేఖ రాయడం, తెలంగాణ ప్రభుత్వం జీవో తీసుకొచ్చేలా చేయటం కోసం కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో తాగి డ్రైవింగ్ చేయటం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో కేవలం 2014, 2015లోనే 846 మంది మరణించారు, 4,590మంది గాయపడ్డారు. 19–30 ఏళ్ల మధ్యవారు మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం వల్లే ప్రధానంగా ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి.



**రోడ్డు ప్రమాదాల నివారణకు వ్యవస్థీకృత మార్పులు అవసరం**

డ్రైవింగ్ లైసెన్సుల్లో 30శాతం బోగస్‌వే అని ఉపరితల రవాణామంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా అంగీకరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా సమగ్ర చర్యలతో 18 రాష్ట్రాల రవాణా మంత్రుల కమిటీ సిఫార్సుల ఆధారంగా రూపొందించిన మోటారు వాహనాల భద్రతా (సవరణ) బిల్లు పార్లమెంటు ముందు పెండింగ్‌లో ఉందని, ఇది వచ్చే సమావేశాల్లో ఆమోదం పొందుతుందని ఆశిస్తున్నామని మంత్రి ఇటీవల భద్రతా వారోత్సవాల సందర్భంగా చెప్పారు. పరిమితికి మించిన వేగంతో వెళ్లేవారికి జరిమానా, వాహన బీమా లేకుండా నడిపితే జరిమానా – మూడు నెలల జైలుశిక్ష, హెల్మెట్ లేకుండా నడిపితే జరిమానా – మూడు నెలల లైసెన్సు రద్దు వంటి చర్యల్ని ఇందులో పొందుపరిచారు. మైనరు పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు, సంరక్షకులు దోషులవుతారు. వారి వాహనం లైసెన్సు రద్దవుతుంది. తల్లిదండ్రులకు రూ. 25వేల జరిమానా నుంచి మూడేళ్ల జైలు శిక్ష వరకూ పడే అవకాశముంది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. 500 జరిమానా, అధికారుల ఆదేశాలను లెక్కచేయకుంటే రూ. 2000 జరిమానా నిబంధనను పొందుపరిచారు. వాహన లైసెన్సు తీసుకోకుండా నడిపితే రూ. 5000 జరిమానా విధిస్తారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడిపితే రూ. 5000 జరిమానా, డ్రైవరు పరీక్షలో విఫలమైనవారు నడిపితే రూ. 10000 జరిమానా విధిస్తారు. ప్రమాదకరంగా వాహనం నడిపినా, తాగి నడిపినా భారీ జరిమానాలు కట్టాలి. ప్రైవేటు రవాణా సంస్థలు లైసెన్సింగ్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. లక్ష జరిమానా చెల్లించుకోవాలి. సీటు బెల్టు పెట్టుకోకపోతే రూ. వెయ్యి జరిమానా, మూడు నెలలు లైసెన్సు రద్దు నిబంధనను చేర్చారు. మోటారు వాహనాల చట్టంలోని 223 నిబంధనల్లో 68 నిబంధనలు మార్చి కొత్తగా కొన్ని చేర్చారు. బిల్లులో పేర్కొన్న జరిమానాను రాష్ట్రాలు తమ పరిధిలో పది రెట్ల వరకు పెంచుకోవచ్చు. వాహనాల డీలర్ల వద్దే రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, 2018 అక్టోబర్ 1 నుంచి అన్ని వాహనాలకు ఆటోమేటెడ్ కేంద్రాల వద్ద వాహన పటిష్టత పరీక్షలు నిర్వహించాలని బిల్లు నిర్దేశిస్తోందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా వాహనాల లైసెన్సులు, వ్యక్తుల లైసెన్సుల సమాచారాన్ని ఏకీకృత డేటాబేస్‌లో ఉంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. లైసెన్సు స్థాయి నుంచి ప్రక్షాళన మొదలుపెట్టి, మద్యం తాగి, ర్యాష్‌గా వాహనం నడపటంపై కఠిన చర్యలు, రోడ్ల నిర్మాణంలో జాగ్రత్తలు తదితర చర్యలకు తోడు.. అన్ని జాతీయ రహదారులు, ప్రధాన రాష్ట్ర రహదారులను అనుసంధానం చేస్తూ సమీకృత అత్యవసర సహాయ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తే చాలామంది ప్రాణాలను కాపాడవచ్చు. ఒక నాగరిక ప్రజాస్వామిక వ్యవస్థగా మనదేశం మారటానికి ఇది కనీసస్థాయి వ్యవస్థ. ❧

# సైన్స్ వ్యతిరేక ఉద్యమం పెరుగుతోంది మేలుకొందాం, విద్య, వికేంద్రీకరణతో విరుగుడు వేద్దాం: నోబెల్ విజేతలు

భారత్‌లోనేకాకుండా సంపన్న పాశ్చాత్య దేశాల్లో కూడా సైన్స్ వ్యతిరేక ఉద్యమం వేగంగా వ్యాపిస్తోందని, దీన్ని ఓడించకపోతే జనజీవితాలపై ప్రమాదకర పరిణామాలు సంభవిస్తాయని నోబెల్ బహుమతి గ్రహీతలు విలియం ఇ. మోర్నర్ (రసాయన శాస్త్రం, 2014), హెరాల్డ్ వార్మస్ (వైద్యం, 1989), సెర్జ్ హరోషి (భౌతిక శాస్త్రం, 2012) హెచ్చరించారు. విద్య, అభివృద్ధిలో – అధికారంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం ద్వారా మాత్రమే ఈ ఉత్పాతానికి అడ్డుకట్ట వేయగలమన్నారు.

నోబెల్ ప్రైజ్ సిరీస్ – ఇండియా ప్రోగ్రాం 2017లో భాగంగా ఇటీవల ఈ శాస్త్రవేత్తలు ఢిల్లీలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమస్యలకు సైన్స్ హేతుబద్ధ, తార్కిక పరిష్కారాలను అందిస్తుందని, అవన్నీ 100శాతం కరెక్టు కాకపోయినా, 95శాతం కరెక్టని శాస్త్రవేత్తల త్రయం అన్నారు. కాబట్టే సైన్స్‌ని సురక్షిత పరిష్కారంగా గుర్తించాలన్నారు. "సైన్స్ మంచిదీకాదు, చెడ్డదీ కాదు.. సైన్స్ ఒక వాస్తవం" అని స్పష్టంచేశారు.

సైన్స్ తగ్గుతూ తాత్కాలిక ఆకర్షణల రాజకీయం పెరగటానికి అత్యధికశాతం ప్రజలకు అవకాశాలు అందించలేని రాజకీయ, పాలనా నమూనా కారణమన్నారు. ప్రజల్లో పరాయీకరణ భావం పెరగటం వల్లే శాస్త్రీయత పట్ల వ్యతిరేక ధోరణులకు అవకాశం ఏర్పడిందన్నారు. అభివృద్ధిలో తాము భాగస్వాములం కాలేకపోతున్నామన్న ప్రజల నిరాశానిస్పృహలను ఆసరాగా చేసుకుని డొనాల్డ్ ట్రంప్‌లాంటివారు ఈ ధోరణుల్ని రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందుతున్నారన్నారు. గతంలో సైన్స్ గురించి మాట్లాడటం, సైన్స్‌లోకి ప్రవేశించటం గురించి గౌరవంగా, గర్వంగా మాట్లాడేవారని, ఇప్పుడు 'పూర్వకాలం నుంచి ఏదోకరకంగా తమకు తెలిసిన విషయాల్నే సైన్స్ నిరూపిస్తోంది' అనే తేలికచేసే వ్యాఖ్యలు పెరిగిపోయాయని అన్నారు.

సైన్స్ వ్యతిరేక భావాలు ఏవో కొన్ని దేశాలకు పరిమితమైతే అంత ఆందోళన చెందేవారం కాదని, కానీ ప్రపంచవ్యాప్తంగా ఇదో ఒరవడిగా మారటం ప్రమాద హెచ్చరికేనని వారు అన్నారు. సైన్స్ వ్యతిరేక ధోరణి వల్ల కలిగే తక్షణ నష్టాల గురించి ఉదాహరణగా 2015లో కాలిఫోర్నియాలో జరిగిన ఉదంతాన్ని మోర్నర్ వివరించారు. ఆ సమయంలో అక్కడ మీజిల్స్ (తట్టు జ్వరం) ప్రబలినప్పుడు చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకాలు వేయించేందుకు నిరాకరించారన్నారు. దానంతటదే తగ్గిపోతుందని శాస్త్రీయ వైద్యాన్ని తోసిపుచ్చారన్నారు.


"ఎక్కువమంది సైన్స్‌ని తిరస్కరిస్తే ఎక్కువమంది రోగాల బారిన పడతారు. సమస్యలు లేవని చెప్పేవారు కాదు కావలసింది, సమస్యలకు పరిష్కారాలు అందించేవారు కావాలి" అని పేర్కొన్నారు.




ప్రపంచ యుద్ధాల వంటి సంక్షోభాలు ప్రజలను సైన్స్ దిశగా నడిపించాయని, ఇప్పుడు కూడా అలాంటి సంక్షోభాల నుంచే మళ్లీ సైన్స్ పట్ల ఆకర్షణ దానంతటదే పెరగొచ్చు అని హెచ్చరించారు.

ప్రజలను చిన్నచూపు చూడవద్దు. వారితో నిరంతరం మాట్లాడుతూ, పరిష్కారాలపై చైతన్యవంతుల్ని చేయాలి. ప్రజల్లో సరైన దిశగా అవగాహన పెంచే బోధన, అభివృద్ధి–అధికారంలో భాగస్వామ్యం.. వారిలో హేతుబద్ధ, తార్కిక శక్తిని పెంచుతాయని, మానవాళి సుఖసంతోషాలకు దోహదం చేస్తాయని శాస్త్రవేత్తలు అన్నారు.

కేంద్ర, రాష్ట్ర పాలకుల కేంద్రీకృత పాలన, న్యాయవ్యవస్థ అత్యుత్సాహం, సమాజంపై ప్రభావం చూపగల వెండితెర హీరోలు నిజజీవితంలో పిరికిపందల్లా వ్యవహరించటం, ప్రజల్లో అవిద్య వంటి వైఫల్యాల్ని పచ్చిగా బైటపెట్టిన తమిళనాడు జల్లికట్టు ఆందోళనలు ఈ నోబెల్ శాస్త్రవేత్తల పరిష్కారాల ఆవశ్యకతను తెలియచెప్పే తాజా ఉదంతం మాత్రమే. ఇలాంటి పరిష్కారాల్ని వ్యవస్థీకృతం చేసేందుకే లోక్‌సత్తా సుదీర్ఘ కృషి.




VIF (Vision India Foundation) brings you an opportunity to work with Dr. Jayaprakash Narayan on political reforms.

Dr. JP is a political reformer, thinker, and former bureaucrat. He is the founder of Lok Satta Movement/Party and Foundation for Democratic Reforms.

For this and other unique opportunities in nation-building, checkout VIF Fellowship. visionindiafoundation.com/fellowships

Posting Date 07-02-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on Feb1st 2017

# నిజాలు మాట్లాడుకుందాం-13



**రైతుకి కేజీ కూరగాయల మీద 3 , 4 రూ॥ కు మించి రాదు. కానీ మనం అదే కేజీ ని 30- 40 రూ॥ కి కొంటున్నాము.**

మనం కనుక గ్రేడింగ్ , స్టోరేజి , రవాణా , ప్రాసెసింగ్ లాంటివి మెరుగు పరిస్తే ఆధునిక వ్యవస్థలో లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది .

**రైతు బాగుపడతాడు. వినియోగదారుడు బాగుపడతాడు.**

షేర్ చెయ్యండి ...ప్రభుత్వాలకి నిజాలు చేరవేయండి

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad